Follow: @ANNTELUGU
07-04-2026
# మహా పత్రిక
ANN తెలుగు
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 100 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏఎన్ఎన్ -మహా అవార్డ్స్ కు బండారు దత్తాత్రేయ

**ఆహ్వానించిన ఏఎన్ఎన్ - మహా పత్రికల సీఈవో కంది రామచంద్రారెడ్డి**

**హైదరాబాద్, మహా:** ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ కార్యక్రమానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఏఎన్ఎన్ మహా పత్రికల సీఈవో కంది రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏఎన్ఎన్ మహా పత్రికల ఆధ్వర్యంలో హోటల్ కత్రియాలో ఏప్రిల్ 11న అవార్డుల వేడుక నిర్వహిస్తున్నామని, దీనికి హాజరుకావాలని దత్తాత్రేయను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎన్ఎన్ ఛానల్ న్యూస్ ఎడిటర్ గడ్డం క్రిష్ణమూర్తి పాల్గొన్నారు.

**టాప్ న్యూస్**



### మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం
- అస్సాం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

02



### పాకిస్థాన్ బెదిరింపులపై మోదీ స్పందించరేం?
- మమతా బెనర్జీ ఫైర్

02



### సీఎం దేవుడేమీ కాదు
- మోదీ, పినరయి విజయన్ అహంకారులు
- రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

02





# ఆదిలాబాద్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

**భట్టి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకే వచ్చాం**

**12 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి**
**నిర్మల్ కు 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్**
**జూన్ లో ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ పనులు**
**ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు**
**యూనివర్సిటీకి భూసేకరణకు ఆదేశాలు**
**పిప్రి సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**ఆదిలాబాద్ మహా:** అడవి బిడ్డల ఆదిలాబాద్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం బజార్ హత్నూర్ మండలం పిప్రి లో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో అపార అటవీ ,ఖనిజ సంపద జల వనరులు ఉన్న గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.అందుకే ఇక్కడి ప్రజల కోసం ఒక ప్రజాపాలన తీసుకురావాలన్న ఆకాంక్ష ఏర్పడిందన్నారు. ప్రజల ఆశీర్వాదంతో తమ ప్రభుత్వం ఏర్పడిందన్నారు.పాలమూరుతో సమానంగా ఆదిలాబాద్ ను అభివృద్ధి చేస్తామన్నారు.ఎన్నికలప్పుడే రాజకీయాలు కాని అభివృద్ధి విషయంలో కాదన్నారు.ఇక్కడ 12వందల కోట్ల రూపాయల తో అభివృద్ధి చేస్తున్నామన్నారు.ఎన్నికలప్పుడే రాజకీయాలు కాని అభివృద్ధి విషయంలో కాదన్నారు. ఇతర పార్టీలతో తమ అభిప్రాయాలు వేరు కావచ్చు కాని తమ మధ్య అభిప్రాయ బేధాలు లేవన్నారు.

మిగతా 2లో

## ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా బీజేపీ

### సామాన్య కార్యకర్తలే పార్టీ అసలైన బలం

కేడర్‌కు రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు పిలుపు

వికసిత్ భారత్ నిర్మాణంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలి: బండారు దత్తాత్రేయ, మురళీధర్ రావు



**హైదరాబాద్, మహా:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం హైదరాబాద్ నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వైభవంగా జరిగాయి. పార్టీ ఆవిర్భవించిన చారిత్రాత్మక దినం పురస్కరించుకుని రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు జెండా ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల్లో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, జాతీయ నాయకుడు మురళీధర్ రావు, శాసన మండలి బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ సహా పలువురు కీలక నేతలు, వేలాది మంది

మిగతా 2లో

## విజయన్‌కు సీఎం రేవంత్ ఘాటు లేఖ

**కేరళ వచ్చి వాస్తవాలు వివరిస్తా..**



**హైదరాబాద్, మహా:** తెలంగాణ, కేరళ ముఖ్యమంత్రుల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగుతున్న మాటల యుద్ధం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. కేరళ సీఎం పినరయి విజయన్ చేసిన ట్వీట్లకు కౌంటర్‌గా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఏకంగా ఆరు పేజీల సుదీర్ఘ లేఖను రాశారు. కేరళ అభివృద్ధి మోడల్‌లోని లోపాలను

మిగతా 2లో

## తిరుమల తరహాలో బాసర అభివృద్ధి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 225 కోట్లతో విస్తరణ ఆలయ పనులు
- భూమి పూజ చేసిన సీఎం రేవంత్ రెడ్డి

వివరాలు 2లో

## ఆదిలాబాద్ టౌన్‌కు ప్రత్యేక నిధుల కోసం వినతి
సీఎంకు కంది శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ ఛైర్ పర్సన్ అనూష వినతి

02

## ట్రంప్‌ను లైట్ తీసుకున్న ఇరాన్

**సీజ్ ఫైర్ ప్రతిపాదన తిరస్కరణ.. దేఖ్ లేంగే అంటూ సవాల్**



**మహా:**ట్రంప్ హెచ్చరికలను ఇరాన్ లైట్ తీస్కొంటోంది. పోపోవోయ్ అంటూ నరకం చూపిస్తా అంటూ ఎన్ని బూతులుతిట్టినా.. అది ఫ్రస్టేషన్ సంకేతమంటూ ధీటుగా బదులిస్తోంది. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రతిపాదనలను తమ ప్రభుత్వం తిరస్కరించిందని ఇరాన్ అధికారిక వార్త సంస్థ తాజాగా ఓ కథనాన్ని ప్రచురించింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ మరికొన్ని గంటల్లో ముగియనున్న నేపథ్యంలో ఈ కథనం కలకలం రేపుతోంది. ఈ నిర్ణయాన్ని ఇరాన్ ప్రభుత్వం పాక్ ద్వారా అమెరికాకు తెలియజేసిందని సమాచారం. ఈ అంశంలో తాత్కాలిక కాల్పుల విరమణకు బదులు శాశ్వతంగా యుద్ధానికి తెరదించే పరిష్కారం కావాలని ఇరాన్ పేర్కొన్నట్టు తెలిసింది.

### శాంతి ప్రయత్నాలు

గల్ఫ్ లో శాంతిస్థాపన కోసం పలు దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి.

మిగతా 2లో

## ట్రంప్ యుద్ధ నేరాలు చేస్తున్నారు
**ఇరాన్ డిప్యూటీ విదేశాంగ శాఖ మంత్రి కాజిమ్ ఘారిబాబాదీ**

వివరాలు 2లో



## కోహెడ మార్కెట్ భూములను అమ్మేస్తారా?

- 3 వేల కోట్ల విలువైన 200 ఎకరాల రైతు భూమిపై కాంగ్రెస్ కన్ను
- టీజీఐఐసీకి అప్పగించి అనుయాయులకు కట్టబెట్టే కుట్ర!
- నిధులు, భూమి, డీపీఆర్ సిద్ధంగా ఉన్నా పనులెందుకు ఆపారు?
- 'దిల్' భూముల పేరుతో రైతులను మోసం చేస్తారా?
- రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు నిప్పులు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రానికి తలమానికంగా నిలవాల్సిన కోహెడ అంతర్జాతీయ పండ్ల మార్కెట్ ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ రియల్ ఎస్టేట్ దందాలకు అడ్డాగా మారుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం కోహెడ పండ్ల మార్కెట్ స్థలాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ తదితర నేతలతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, రైతులకు ఉపయోగపడే 200 ఎకరాల కోహెడ మార్కెట్ భూమిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కన్ను పడిందని, సుమారు 3 వేల కోట్ల రూపాయల విలువైన ఈ భూమిని తన అనుయాయులకు కట్టబెట్టేలా రహస్య కుట్రలు సాగిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. కోహెడ పండ్ల మార్కెట్ పరిరక్షణ కోసమే తాను ఇక్కడికి వచ్చానని, ఇది రాజకీయ సమస్య కాదని, లక్షలాది మంది రైతుల బతుకుదెరువుకు సంబంధించిన అత్యంత కీలకమైన సమస్య అని ఆయన స్పష్టం చేశారు. ఏ ప్రభుత్వమైనా రైతుల ప్రయోజనాల కోసం పనిచేయాలి తప్ప నలుగురు

మిగతా 2లో



# మహిళా రిజర్వేషన్స్ వల్ల నో ప్రోబ్లం

## అస్సాం ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

**మహా:** మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కోసం పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి. దీనిపై ప్రధాని మోదీ అస్సాం ఎన్నికల ప్రచారంలో స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వల్ల ఏ రాష్ట్ర ప్రాతినిధ్యానికీ భంగం వాటిల్లదని ఆయన పేర్కొన్నారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీల నేతలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో అమలులో ఉన్న జనాభా నియంత్రణ చర్యల గురించి కూడా ఆయన ప్రస్తావించారు. "ఏప్రిల్ 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఇప్పటికే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు గురించి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలతో మేము చర్చించాం. దేశంలోని సోదరీమణుల, కుమార్తెల హక్కులకు సంబంధించిన ఈ పనిని ఏకగ్రీవంగా ముందుకు తీసుకెళ్లాలని మేము అందరినీ కోరాం. అయితే కొందరు వ్యక్తులు ఈ గొప్ప కార్యంపై గందరగోళం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. వాస్తవానికి దేశంలోని అన్ని రాష్ట్రాలు దీనివల్ల ప్రయోజనం పొందుతాయి. దీని వల్ల ఏ రాష్ట్రానికి నష్టం వాటిల్లదు. జనాభా నియంత్రణ ఎక్కువగా ఉన్న ఈశాన్య రాష్ట్రాలు కావచ్చు లేదా దక్షిణాది రాష్ట్రాలు కావచ్చు. వారి ప్రాతినిధ్యం ఏమాత్రం తగ్గదు. మహిళల కోసం అదనపు సీట్లు కేటాయించేలా మేము ఏర్పాట్లు చేస్తున్నాం. అలాగే ప్రస్తుతం ఉన్న సీట్లను మరింత పెంచాల్సిన అవసరం ఉంది. అందుకే, ఈ చట్టాన్ని అందరూ కలిగి ఆమోదించేలా రాజకీయ పార్టీల నేతలపై ఒత్తిడి తీసుకురావాలని నేను ప్రత్యేకంగా అసోం సోదరీమణులను కోరుతున్నాను."అని మోదీ వివరించారు.

# ఆదిలాబాద్ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అలాగే నిర్మల్ లో కూడా 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేస్తున్నామన్నారు.తమ ఆడబిడ్డల కోసం రూపాయి ఖర్చు లేకుండా బస్సుప్రయాణం ఇస్తున్నామన్నారు. 10వేల కోట్ల రూపాయలు వారి ప్రయాణానికి ప్రభుత్వం ఖర్చు పెట్టిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లకోసం 22వేల 5వందల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందన్నారు. సన్నబియ్యయంతో పేదల వాడి కడుపు నింపాలన్న ఆలోచనతో సన్నబియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఆడబిడ్డలకు బస్సుప్రయాణం మాత్రమే కాదని బస్సులకు యాజమానులను చేసామన్నారు. ఇక ఆదిలాబాద్ కు ఎర్ర బస్సే కాదు ఎయిర్ బస్సు తీసుకువస్తామన్నారు. జూన్ లో ఎయిర్ పోర్ట్ కు శిలాఫలకం వేస్తామన్నారు .అడవుల జిల్లా ఆదిలాబాద్ ను పర్యాటక కేంద్రంగానే పారిశ్రామిక వాడగా అభివృద్ధి చేస్తామన్నారు.దీనికి సంబంధించి భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు .వేల కోట్లతో కట్టిన కాళేశ్వరం కాస్తా కూలేశ్వరం అయిందని విమర్శించారు. చుక్కనీరు రావడంలేదన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభించి ఆదిలాబాద్ ప్రజలకు సాగునీరు తాగునీరు ఇస్తామన్నారు. అలాగే యూనివర్సిటీ కోసం భూసేకరణ కోసం ఆదేశించారు. బాసర లో మందిరం విస్తరణకు 225 కోట్లు ప్రాథమికంగా మంజూరు చేసి పూనుకున్నామన్నారు. ఇంకా అవసమైతే నిధులు వెచ్చిస్తామన్నారు. గోదావరి జలాలు ఒడిసి పట్టి ఇక్కడి నేలలను సస్యశ్యామలం చేస్తామన్నారు. పేదవాడి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు .ఈ డిసెంబర్ లో ఆడబిడ్డలకు మళ్లీ చిలక పచ్చ రంగు చీరలు ఇస్తామన్నారు. మత్తు వదలరా మైదానాల బాట పట్టరా అనేలా క్రీడలను ప్రోత్సహిస్తామన్నారు. మట్టిలో మాణక్యాలు వెలికి తీసేలా ఇంచార్జి మంత్రికి ఆదేశాలు ఇస్తున్నామనన్నారు. ప్రజల ఆశీర్వాదంతో 2034 వరకు తమ ప్రభుత్వమే ఉంటుందన్నారు . అనంతరం 30వేల 149 మహిళా సంఘాలకు 53కోట్ల 50లక్షల చెక్ అందించారు. పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు పంపిణీ చేసారు.

# తిరుమల తరహాలో బాసర అభివృద్ధి -సీఎం రేవంత్ రెడ్డి

## 225 కోట్లతో విస్తరణ ఆలయ పనులు... భూమి పూజ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఆదిలాబాద్ మహా:** నిర్మల్ జిల్లాలోని బాసరలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సోమవారం పర్యటించారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి మంత్రి జూపల్లి కృష్ణారావు , దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారులు విప్ లు మంత్రులు,టీపీసీసీ ఛీఫ్ ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ,స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రూ.225 కోట్ల వ్యయంతో అమలు చేయనున్న సమగ్ర అభివృద్ధి మాస్టర్ ప్లాన్‌కు శ్రీకారం చుట్టారు. దేవాలయ సమీపంలో రూ.225 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించిన ముఖ్యమంత్రి, అదనంగా రూ.200 కోట్లతో ముధోల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి కూడా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన 'కాఫీ టేబుల్ బుక్'ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు సుదర్శన్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి,



ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, ఏలేటి మహేశ్వర్ రెడ్డి, వెడ్మ బొజ్జు పటేల్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, నిర్మల్, బైంసా మున్సిపల్ చైర్మన్లు అప్పాల కావ్య, దత్తాత్రి, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, బైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్ బెదిరింపులపై మోదీ స్పందించరేం?

## మమతా బెనర్జీ ఫైర్

**మహా :** "పాకిస్థాన్ రక్షణ మంత్రి చేసిన ప్రేలాపణలను బెంగాల్‌లో సభలో ప్రధాని ఎందుకు ప్రస్తావించలేదు? పాక్ కోల్‌కతాపై దాడి చేస్తామని చెప్పినప్పుడు, మేం కఠిన చర్యలు తీసుకుంటాం అని మోదీ ఎందుకు అనలేదు? దేశానికి వచ్చే ఏ బెదిరింపునైనా మనం ఎలాగైతే అంగీకరించమో, అలాగే కోల్‌కతాకు వచ్చే హెచ్చరికలను కూడా మేం చూస్తూ ఊరుకోం" అని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. సోమవారం నాడియా జిల్లాలో జరిగిన ఎన్నికల సభలో మమతా ఈ మేరకు వ్యాఖ్యానించారు.

# సీఎం దేవుడేమీ కాదు

## మోదీ, పినరయి విజయన్ అహంకారులు

## రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు

**మహా:** ప్రధాని నరేంద్ర మోదీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇద్దరూ 'అహంకారులు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. వాళ్లిద్దరూ ప్రజలతో కలిసి పనిచేయడం కంటే, వారిపై పాలన సాగించాలనే మనస్తత్వం కలిగిన వారని ఆయన ఆరోపించారు. కేరళలోని త్రిస్సూర్ లో జరిగిన ఎన్నికల ర్యాలీలో మాట్లాడిన రాహుల్ గాంధీ, కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పోటీ కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్, అధికార ఎల్‌డీఎఫ్ మధ్యే ఉంటుందన్నారు. అయితే ఎల్‌డీఎఫ్‌కు బీజేపీ లోపాయికారంగా సహకరిస్తోందని విమర్శించారు.

# ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా బీజేపీ

(మొదటిపేజీ తరువాయి)

కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ కోట్లాది మంది కార్యకర్తల నిస్వార్థ త్యాగం, అంకితభావం వల్లే బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని కొనియాడారు. పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతూ, ఇది కేవలం సంబరాలు చేసుకునే రోజు మాత్రమే కాదని, 'దేశమే ప్రథమం' సిద్ధాంతం పట్ల నిబద్ధత చాటుకునే గర్వకారణమైన రోజని ఉద్ఘాటించారు. సామాన్య కార్యకర్తలే బలగంగా, దేశహితమే పరమావధిగా ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం నేడు ప్రపంచ రాజకీయ యవనికపై అగ్రస్థానానికి చేరుకుందని రాంచందర్ రావు గుర్తు చేశారు. నాడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయి వేసిన పటిష్ట పునాదులపై నేడు పార్టీ అప్రతిహతంగా దూసుకుపోతోందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా సామాజిక మార్పు కోసం, అంత్యోదయ సిద్ధాంతంతో పేదల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని కొనియాడారు. సామాన్య కార్యకర్తకు సైతం ఉన్నత పదవులు అందిస్తూ, ప్రజాస్వామ్య విలువలకు పెద్దపీట వేస్తున్న తీరును వివరించారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని సూచించారు.తెలంగాణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై స్పందిస్తూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి కార్యకర్త ప్రజల గొంతుకగా మారి పోరాడాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక విధానాలు ఎండగట్టడంలో బీజేపీ కార్యకర్తలు ముందుండాలని, సామాన్యులకు భరోసా కల్పించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం నేడు స్వయం సమృద్ధమైన, దృఢమైన దేశంగా మారుతోందని, 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారతదేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా నిలబెట్టే ప్రయాణంలో తెలంగాణ రాష్ట్రం కీలక పాత్ర పోషించాలని, అందుకు పార్టీ కేడర్ క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యపరచాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బండారు దత్తాత్రేయ, మురళీధర్ రావు మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల కృషి అమోఘమని ప్రశంసించారు. నాటి జనసంఘ్ కాలం నుంచి నేటి బీజేపీ వరకు సాగిన ఈ ప్రయాణంలో ఎంతో మంది నాయకులు తమ జీవితాలు ధారపోశారని, వారి స్ఫూర్తితోనే ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం రాజీలేని పోరాటం చేసే సత్తా కేవలం బీజేపీకే ఉందని పేర్కొన్నారు. ఏవీఎన్ రెడ్డి, మల్క కొమురయ్య మాట్లాడుతూ తెలంగాణ గడ్డపై కమల వికాసం సాధించి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ వేడుకలు కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. నేతలు పరస్పరం మిఠాయిలు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

# ట్రంప్‌ను లైట్ తీసుకున్న ఇరాన్

(మొదటిపేజీ తరువాయి)

ఈ దిశగా ఇరు వర్గాలు 45 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని సూచించాయి. ఈ విషయమై కైరోలోని ఇరాన్ దౌత్యవేత్త మొజ్తాబా ఫిర్దౌసీ కూడా స్పందించారు. 'కేవలం కాల్పుల విరమణను అంగీకరించబోము. ఈ యుద్ధం ముగిసిపోవాలి. మళ్లీ దాడులు ఉండబోవన్న గ్యారెంటీ కావాలి' అని ఆయన తమ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేశారు. డెడ్‌లైన్ ముగిశాక తాము మరిన్ని దాడులకు దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతంలో ప్రకటించిన విషయం తెలిసిందే. పవర్ ప్లాంట్‌లు, బ్రిడ్జిలు వంటి వసతులపై దాడులు మొదలవుతాయని హెచ్చరించారు. హోర్ముజ్‌ను తెరవకపోయినా, తమతో డీల్ కుదుర్చుకోకపోయినా ఇరాన్‌లో నరకం కనిపిస్తుందని హెచ్చరించారు. మరోవైపు, ఇజ్రాయెల్ తాజాగా ఇరాన్‌లోని కీలక పెట్రోకెమికల్ ప్లాంట్‌ను టార్గెట్ చేసింది. ఈ దాడిలో ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్స్ దళానికి చెందిన ఇద్దరు కమాండర్లు మృతి చెందారు. ఇరాన్‌కు ఆదాయ మార్గాలను మూసివేసే దిశగా ఈ దాడి చేశామని ఇజ్రాయెల్ చెప్పుకొచ్చింది.

# శ్రీవారి హుండీలో నిలిచిన 'పాత' నోట్ల రాశి

## రూ.400 కోట్లు నిరుపయోగం!

**తిరుమల, మహా:** కలియుగ వైకుంఠమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సన్నిధిలో భక్తులు సమర్పించిన కానుకలు ఇప్పుడు అధికారులకు పెను సవాలుగా మారాయి. 2016లో కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన ₹500, ₹1000 నోట్ల ప్రవాహం ఇప్పటికీ శ్రీవారి హుండీలో కొనసాగుతూనే ఉంది. ఫలితంగా ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వద్ద దాదాపు ₹400 కోట్ల విలువైన పాత కరెన్సీ నోట్లు పేరుకుపోయాయి. అయితే, ఈ భారీ మొత్తాన్ని మార్పిడి చేసేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లేదా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు అనుమతించకపోవడంతో ఈ నిధులు నిరుపయోగంగా మారాయి. సాధారణంగా గడువు ముగిసిన పాత నోట్లను ప్రైవేటు వ్యక్తులు లేదా సంస్థలు ధ్వంసం చేయడం జరుగుతుంది. కానీ, టీటీడీ అధికారులు మాత్రం ఈ నోట్లను అత్యంత భద్రంగా దాచి ఉంచారు. ఇవి భక్తులు తమ భక్తిశ్రద్ధలతో మొక్కుబడిగా సమర్పించిన కానుకలు కావడం, వాటితో భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. కోట్లాది రూపాయల భక్తుల సొమ్ము వృథా కాకూడదని టీటీడీ పాలకమండలి గత కొన్ని సంవత్సరాలుగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు, ఆర్బీఐకి పదేపదే విన్నపాలు చేస్తోంది. ఈ నోట్లను మార్పిడి చేసి, ఆ సొమ్మును టీటీడీ సామాజిక మరియు ధార్మిక కార్యక్రమాలకు వినియోగించుకునేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించాలని కోరుతున్నారు. మరోవైపు, కేంద్రం ఇటీవల ఉపసంహరించుకున్న ₹2,000 నోట్ల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. ఈ గులాబీ రంగు నోట్లను బ్యాంకులు ఇంకా స్వీకరిస్తున్నాయి. హుండీలో ప్రతి నెలా సగటున ₹35 లక్షల విలువైన ₹2,000 నోట్లు వస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు బ్యాంకుల్లో జమ చేస్తున్నట్లు సమాచారం. అయితే, డీమోనిటైజేషన్ నాటి ₹500, ₹1000 నోట్ల విషయంలోనే ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఒకవేళ కేంద్రం సానుకూలంగా స్పందించకపోతే, ఈ ₹400 కోట్ల రూపాయల భక్తుల కానుకలు కేవలం కాగితపు ముక్కలుగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# జర్నలిస్టులకు గుడ్‌న్యూస్

## ఏప్రిల్‌లోనే కొత్త అక్రిడిటేషన్ కార్డులు!

**హైదరాబాద్, మహా:** జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియ ఎటువంటి ఆటంకాలు లేకుండా నిరంతరాయంగా కొనసాగుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ సి.హెచ్.ప్రియాంక స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ల జారీపై ఇటీవల కొన్ని మీడియా వర్గాల్లో వస్తున్న వార్తల పట్ల జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె భరోసా ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ఆమె ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, దరఖాస్తుల పరిశీలన మరియు కార్డుల జారీ ప్రక్రియకు సంబంధించిన కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటివరకు అందిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరగనున్న రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు ప్రియాంక తెలిపారు. ఈ సమావేశంలో అర్హత పొందిన జర్నలిస్టులందరికీ ఏప్రిల్ నెలలోనే కొత్త అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. అర్హత కలిగిన జర్నలిస్టులు ఎవరైనా ఇంకా దరఖాస్తు చేసుకోకపోతే, వెంటనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలని ఆమె సూచించారు. అక్రిడిటేషన్ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. జిల్లా స్థాయి జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ఉందని ప్రత్యేక కమిషనర్ తెలిపారు. జిల్లాల్లో కూడా ఈ నెలలోనే అక్రిడిటేషన్ కమిటీ సమావేశాలను నిర్వహించి, అర్హులైన జర్నలిస్టులకు కార్డులు అందజేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

# కామాంధుడి కబంధహస్తాల నుంచి చిన్నారి రక్ష

## యువకుడి సాహసానికి 'సజ్జనార్' సలాం!

**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలో మృగాల సంచారం ఆగడం లేదు. అభంశుభం తెలియని పసిహృదయాలపై సైతం కామాంధులు కన్నేస్తున్నారు. గోల్కొండ ప్రాంతంలో ఎనిమిదేళ్ల పాఠశాల విద్యార్థినిపై జరిగిన అత్యాచారయత్నం ఘటన నగరవాసులను తీవ్రంగా కలచివేసింది. అయితే, ఒక సామాన్య యువకుడు ప్రదర్శించిన అప్రమత్తత, ధైర్య సాహసాల వల్ల ఆ చిన్నారి తృటిలో పెను ప్రమాదం నుంచి తప్పించుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోల్కొండ పరిధిలో నివసించే ఎనిమిదేళ్ల బాలిక సోమవారం సాయంత్రం పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు ఒక ఆటో ఎక్కింది.నిర్దేశించిన మార్గంలో కాకుండా, ఆటో డ్రైవర్ సలీం బాలికకు మాయమాటలు చెప్పి దారి మళ్లించాడు. ఆమెను ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో భయాందోళనకు గురైన చిన్నారి గట్టిగా కేకలు వేస్తూ ఏడ్చింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న మహ్మద్ ఫిరోజ్ అనే స్థానిక యువకుడు చిన్నారి ఆర్తనాదాలను విని అప్రమత్తమయ్యాడు. ఏదో అనర్థం జరుగుతోందని గ్రహించిన ఫిరోజ్, ఏమాత్రం సంకోచించకుండా ఆటో వద్దకు పరిగెత్తుకెళ్లాడు. యువకుడిని చూడగానే భయపడిన నిందితుడు సలీం, బాలికను అక్కడే వదిలేసి ఆటోతో సహా పరారయ్యాడు.అనంతరం ఫిరోజ్ ఎంతో చాకచక్యంగా వ్యవహరించారు. భయంతో వణికిపోతున్న చిన్నారిని ఓదార్చి, ఆమె మెడలో ఉన్న స్కూల్ ఐడీ కార్డు ఆధారంగా పాఠశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కానిస్టేబుళ్లు సాయికృష్ణ, కేదార్ సింగ్ వేగంగా స్పందించి గాలింపు చేపట్టి, నిందితుడు సలీంను అదుపులోకి తీసుకున్నారు. అతడి ఆటోను కూడా సీజ్ చేశారు. బాలికను సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక చిన్నారి జీవితాన్ని కాపాడిన మహ్మద్ ఫిరోజ్‌ను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. తన కార్యాలయానికి పిలిపించుకుని ఆయనను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. సమాజంలో ఇలాంటి స్పందనలు పెరిగినప్పుడే నేరాలను అదుపు చేయగలమని సీపీ వ్యాఖ్యానించారు. అలాగే నిందితుడిని పట్టుకోవడంలో చురుగ్గా వ్యవహరించిన కానిస్టేబుళ్లను కూడా ఆయన ప్రశంసించారు. అభంశుభం తెలియని చిన్నారిని కాపాడిన ఫిరోజ్‌పై ప్రస్తుతం నగరవ్యాప్తంగా ప్రశంసల జల్లు కురుస్తోంది

# విజయన్‌కు సీఎం రేవంత్ ఘాటు లేఖ

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తిచూపుతూనే, తెలంగాణలో గత 28 నెలల్లో సాధించిన ప్రగతిని ఆయన ఈ లేఖలో వివరించారు. పినరయి విజయన్ ఉటంకించిన గణాంకాలన్నీ 202324 నాటివని, అవి తెలంగాణలో గత ప్రభుత్వ (BRS) పాలన చివరి దశకు సంబంధించినవని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. "మేము అధికారంలోకి వచ్చి 28 నెలలే అయ్యింది, మీరు 120 నెలలుగా అధికారంలో ఉన్నారు. 70 ఏళ్ల కేరళ ప్రస్థానాన్ని మా 28 నెలల పాలనతో పోల్చడం తగదు" అని ఆయన హితవు పలికారు. కేరళలో జరిగిన 'గోల్డ్ స్మగ్లింగ్' కేసును, శబరిమల ఆలయ బంగారం తాపడం విషయంలో జరిగిన అక్రమాలను రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గాంధీ కుటుంబాన్ని వేధిస్తోందని, కానీ కేరళ సీఎం కార్యాలయంపై వస్తున్న ఆరోపణల విషయంలో సీబీఐ ఎందుకు మౌనంగా ఉందో ప్రజలకే వదిలేస్తున్నానని ఆయన వ్యాఖ్యానించారు. అయితే లేఖ చివరలో రేవంత్ రెడ్డి ఒక ఆసక్తికరమైన ముగింపు ఇచ్చారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన 'నరసింహం' సినిమాలోని ప్రసిద్ధ డైలాగ్ "నీ పో మోనే విజయన్" (నువ్వు వెళ్లు బాబు విజయన్) అని ఉటంకిస్తూ కేరళ సీఎంకు సెటైర్ వేశారు. అలాగే, ఏప్రిల్ 7న తిరువనంతపురం వచ్చి నేరుగా గణాంకాలతో చర్చించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఆహ్వానించారు. తెలంగాణ అభివృద్ధిని విమర్శించే ముందు వాస్తవాలు తెలుసుకోవాలని రేవంత్ రెడ్డి ఈ లేఖ ద్వారా హితవు పలికారు.

# రాష్ట్రవ్యాప్తంగా వరుణుడి విలయం

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి ప్రకోపం పెను విషాదాన్ని నింపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తుండగా.. ఆకాశం నుంచి పడుతున్న పిడుగులు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. గడిచిన 48 గంటల వ్యవధిలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పిడుగుపాటుకు గురై ఏకంగా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం సంచలనం కలిగిస్తోంది. సోమవారం ఒక్కరోజే ఐదుగురు మృతి చెందగా, ఆదివారం ముగ్గురు మృత్యువాత పడ్డారు. అప్పటివరకు కళ్లముందే ఉన్నవారు పిడుగుపాటుకు నిశ్చేతనంగా పడి ఉండటం చూసి ఆయా కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. సోమవారం మధ్యాహ్నం ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ప్రకృతి కన్నెర్ర చేయడంతో పెను నష్టం సంభవించింది. ముండ్లమూరు మండలం పసుపుగల్లులో పొలం పనుల్లో ఉన్న రావులపల్లి శివరామకృష్ణపై పిడుగు పడటంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. మార్కాపురం జిల్లా పరిధిలోని పుల్లలచెరువు వద్ద గల ఒక మొక్కజొన్న ఫ్యాక్టరీపై పిడుగు విరుచుకుపడటంతో కన్నయ్య అనే యువకుడు దుర్మరణం చెందగా, మరో నలుగురు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అదే మండలం యండ్రపల్లిలో పిడుగుపాటుకు నాగయ్య అనే రైతు ప్రాణాలు విడిచారు. కనిగిరి మండలం కలగట్ల రైల్వే స్టేషన్ సమీపంలో పనుల నిమిత్తం వచ్చిన దుర్గేశ్ అనే వ్యక్తి కూడా ఈ ప్రకృతి విపత్తుకు బలైపోయారు. ఉత్తరాంధ్రలోనూ పిడుగుల ధాటికి ప్రాణనష్టం సంభవించింది. విజయనగరం జిల్లా వంగరలో పొలంలో మొక్కజొన్న కంకులు ఏరుతున్న సమయంలో ఇనముల నర్సమ్మ (48) అనే మహిళా రైతుపై పిడుగు పడటంతో ఆమె అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు.

# కోహెడ మార్కెట్ భూములను అమ్మేస్తారా?

(మొదటిపేజీ తరువాయి)



ఐదుగురు దళారుల కోసం కాదని హరీశ్ రావు హితవు పలికారు. గడ్డిఅన్నారం ఫ్రూట్ మార్కెట్లో పెరుగుతున్న రద్దీని, భయంకరమైన ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు అవసరాల కోసం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ 200 ఎకరాల్లో మార్కెట్ నిర్మాణానికి నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. తాను మార్కెటింగ్ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పోరాడటం వల్లే, పది కోట్ల రూపాయలను రైతులకు భూసేకరణ పరిహారంగా ఇప్పించగలిగామని వివరించారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఇక్కడ అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్ కట్టాలని సంకల్పించామని, అందులో భాగంగానే 2020 సంవత్సరంలో జీవో 11 ద్వారా ఈ మార్కెట్ స్థలాన్ని నోటిఫై చేశామని హరీశ్ రావు వెల్లడించారు. జీవో 216 ప్రకారం మార్కెట్ నిర్మాణం కోసం 350 కోట్ల రూపాయల నిధులను బ్యాంకు ఖాతాల్లో సిద్ధంగా ఉంచామని, ఎలా కట్టాలనే ప్లాన్‌తో పాటు వెయ్యి కోట్ల రూపాయలతో డీపీఆర్ కూడా తయారు చేశామని పేర్కొన్నారు. వందేళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇక్కడే ఫ్లవర్ మార్కెట్, ఫిష్ మార్కెట్ కూడా రావాలని కేసీఆర్ ప్రభుత్వం రూపకల్పన చేసిందని వివరించారు. అంతా సిద్ధంగా ఉన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం పనులు ముందుకు తీసుకెళ్లకపోవడమే కాకుండా, మార్కెట్ భూములను టీజీఐఐసీ (TGIIC)కి అప్పగించి అమ్మేయాలని చూడటం వెనుక భారీ కమీషన్ల కుట్ర దాగి ఉందని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి ఎక్కడ విలువైన భూములు కనిపిస్తే అక్కడ వాటిని అమ్మేయడమే ఏకైక పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రోజుకు 25 నుంచి 30 వేల మంది రైతులకు ఉపయోగపడే భవిష్యత్తు ముఖ్యమా లేక నలుగురు వ్యాపారులు, దళారులు ముఖ్యమా అని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డి నువ్వు రైతుల పక్షాన ఉంటావా లేక దళారుల పక్షాన ఉంటావా అని ప్రశ్నిస్తూ, నీ కమీషన్ల కోసం రైతుల భూములను కూడా వదిలిపెట్టవా అని ఘాటుగా విమర్శించారు. కబ్జాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా చివరకు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోని ఈ భూములపై కన్నేయడం దారుణమని ధ్వజమెత్తారు. కోహెడ భూములకు ప్రత్యామ్నాయంగా 'దిల్' భూముల్లో మార్కెట్ కట్టిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలని హరీశ్ రావు కొట్టిపారేశారు. సదరు 'దిల్' భూముల జోలికి వెళ్లవద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని, ఆ వివాదంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా ఇన్వాల్వ్ అయి ఉందని, అక్కడ ఎస్సీ రైతులు సాగు చేసుకుంటున్నారని ఆయన గుర్తు చేశారు. కోర్టు వివాదాల్లో ఉండి, స్టేలు ఉన్న భూములను రైతులకు ప్రత్యామ్నాయంగా ఇస్తామంటే ఏ రైతు నమ్ముతాడని ప్రశ్నించారు. ఈ మార్కెట్ నిర్మాణాన్ని ఆపేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని, కానీ అంతర్జాతీయ స్థాయి మార్కెట్ వచ్చే వరకు బీఆర్ఎస్ పార్టీ విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు దాదాపు కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో చేర్చి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిషేధిత భూముల్లో రైతుల భూములు చేర్చి వారిని వేధించవద్దని డిమాండ్ చేశారు. ప్రస్తుత వ్యవసాయ శాఖ మంత్రి గారు స్వయంగా రైతు కాబట్టి, ప్రభుత్వంతోనైనా కొట్లాడి కోహెడలోనే మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించేలా చూడాలని కోరారు. వెంటనే పనులు ప్రారంభించకపోతే రైతుల పక్షాన ఎంత దూరమైనా పోరాడుతామని, ప్రభుత్వం మెడలు వంచైనా కోహెడలోనే మార్కెట్ నిర్మించేలా చేస్తామని హరీశ్ రావు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి మరియు ఇతర నాయకులు కూడా కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను తీవ్రంగా ఎండగట్టారు.

# ట్రంప్ యుద్ధ నేరాలు చేస్తున్నారు

## ఇరాన్ డిప్యూటీ విదేశాంగ శాఖ మంత్రి కాజిమ్ ఘారిబాబాదీ

**మహా :** ఇరాన్‌పై జరిగే ప్రతీ దాడికి, వెంటనే శత్రువులకు పశ్చాత్తాపాన్ని మిగిల్చేంత బలమైన ప్రతిదాడిని చేస్తామని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ శాఖ మంత్రి కాజిమ్ ఘారిబాబాదీ హెచ్చరించారు. ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై దాడులు చేస్తామంటూ అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్ చేస్తున్న హెచ్చరికలన్నీ యుద్ధ నేరాల పరిధిలోకి వస్తాయన్నారు. అమెరికా అత్యున్నత స్థాయి అధికారి హోదాలో ఉన్న ట్రంప్ యుద్ధ నేరాలు చేస్తానని బహిరంగంగా ప్రకటించి అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించారని ఆయన విమర్శించారు. విద్యుత్ ప్లాంట్లు, పరిశ్రమలు, వంతెనలపై దాడులు చేస్తామంటూ ట్రంప్ వార్నింగ్‌లు ఇవ్వడం అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు చెందిన రోమ్ స్టాచ్యూట్‌లోని ఆర్టికల్ 8(2)(బీ) ప్రకారం



యుద్ధ నేరం అవుతుందని కాజిమ్ ఘారిబాబాదీ పేర్కొన్నారు. అమెరికా ఇలాంటి దాడులకు పాల్పడితే ప్రెసిడెంట్ ట్రంప్ చట్టపరమైన బాధ్యతను వహించాల్సి ఉంటుందన్నారు.

**మా యురేనియం కోసమే ఆ రెస్క్యూ ఆపరేషన్**

"ఏప్రిల్ 5న ఇస్ఫహాన్ ప్రావిన్స్‌లో పైలట్ రెస్క్యూ పేరుతో ఇరాన్‌కు చెందిన శుద్ధిచేసిన యురేనియం స్వాధీనానికి అమెరికా మోసపూరిత ఆపరేషన్‌ను నిర్వహించి ఉండొచ్చు. ఇరాన్‌లో జరిగిన అమెరికా పైలట్ రెస్క్యూ ఆపరేషన్‌ను ఆ కోణంలోనూ మేం చూడాల్సి ఉంటుంది. అసలు సమస్యలకు పరిష్కారాల్ని కనుగొనకుండానే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే, అమెరికా-ఇజ్రాయెల్‌లు మళ్లీ జట్టుకట్టి సైనిక ఘర్షణను మొదలుపెట్టే అవకాశాలు మిగులుతాయి. హార్మూజ్ జలసంధి మీదుగా నౌకల సురక్షిత రాకపోకల కోసం ప్రొటోకాల్స్ తయారీకి ఒమన్‌తో ప్రస్తుతం చర్చలు జరుపుతున్నాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయీ తెలిపారు.

# గిరిజనేతరుల చేతుల్లో... గిరిజన భూములు

- సీలింగ్ యాక్ట్ ద్వారా గిరిజనులకు వచ్చిన భూములకు పట్టాలి ఇవ్వాలి
- 8 లక్షల ఎకరాల భూములకు ప్రభుత్వం పట్టాలివ్వడం లేదు
- తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి గంట సత్యం



**మంచిర్యాల, మహా :** మందమర్రి, కాసిపేట, జన్నారం, గంభీరావుపేట తదితర గ్రామాలలో గిరిజనేతరుల చేతుల్లో... గిరిజనుల భూములు ఎలా వెళ్లాయని తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, రాష్ట్ర కార్యదర్శి గంట సత్యం, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంజి రాజయ్య లు ధ్వజమెత్తారు. సోమవారం మందమర్రి ప్రెస్ క్లబ్ లో తుడుం దెబ్బ నేతలు విలేకరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1973 సంవత్సరంలో మందమర్రి, జన్నారం, తిర్యాని, లక్షటి పేట, కాసిపేట తదితర మండలాలలో ఆదివాసి గిరిజనులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం భూములను సీలింగ్ ద్వారా ఇచ్చిందని అన్నారు. భూస్వాముల వద్ద సేకరించిన సీలింగ్ భూములను ఆదివాసీలకు ఇచ్చినట్లుగా రెవెన్యూ రికార్డులలో నమోదు చేయకపోవడం వల్ల అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 1970 సంవత్సరంలో భూస్వాముల నుండి సేకరించి సీలింగ్ పట్టాలుగా చేసి నిరుపేదలకు పంచిన భూములలో మళ్లీ భూస్వాములే రికార్డుకు వచ్చారని వారు ఆరోపించారు. 1973 గిరిజన చట్టాన్ని మందమర్రి ప్రాంతంలో అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆదివాసి గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని గత 20 సంవత్సరాలుగా తుడుం దెబ్బ సంక్షేమ సంఘం ఆందోళన, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల ఎకరాల భూములకు పట్టాలు ఇవ్వడం ఏ కాకుండా, ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు కూడా పట్టాలు ఇవ్వాలని పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బలవంతంగా తమకు హిందూ చట్టాలను అంటగట్టాలని చూస్తుందని ఆరోపించారు. తమకు ప్రత్యేక ఆదివాసి కులంగా గుర్తించి వందకు వంద శాతం రిజర్వేషన్ అమలు చేయాలని వారు కోరారు. రాష్ట్రంలో ఆదివాసి సంఘాలు నాలుగు సంఘాలుగా విడిపోయాయని తెలిపారు.

**మే 3 న హైదరాబాద్ లో గిరిజన మహాసభ**

మే 3 న తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన గిరిజన మహాసభను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య పిలుపునిచ్చారు.రాష్ట్రవ్యాప్తంగా గిరిజనులు నాలుగు సంఘాలుగా విడిపోయారని విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘాలను ఏకతాటిపై తీసుకువచ్చి ఒకే సంఘం గా ఏర్పడేందుకు ఏప్రిల్ 5 నాడు తామందరం మంచిర్యాల జిల్లాలో సమావేశం అయ్యామని వివరించారు. ఈ సభలో తమకు అనుకూలంగానేతలు స్పందించారన్నారు. అందులో భాగంగా హైదరాబాదులో మే 3 నాడు అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

**సింగరేణి సంస్థ ఆదివాసీలకు ఉద్యోగాలు ఇవ్వడం లేదు**

సింగరేణి కాలరీస్ కంపెనీ గనుల విస్తరణలో భూముల కోల్పోయిన ఆదివాసీలకు అధికారులు ఉద్యోగాలు ఇవ్వడం లేదని తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి గంట సత్యం ఆరోపించారు. మందమర్రి, ఎర్రగుంటపల్లి, బురదగూడెం, సోమగూడెం, దుబ్బ గూడెం ప్రాంతాల రైతుల భూములు కోల్పోతే ఆ రైతులకు సింగరేణి పరిశ్రమలో కానీ, దాని అనుబంధ పరిశ్రమ సోలార్, ఎన్టిపిసి, ఇతర కాంట్రాక్టు పనులలో ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆయన దుయ్యబట్టారు. ఈ బొగ్గు పరిశ్రమ ద్వారా వలస వచ్చిన వారు తమ భూములను చరబట్టి బహులంతస్తుల భవనాలు నిర్మించుకుంటుంటే రెవెన్యూ మున్సిపల్, పోలీస్ శాఖ, ఎమ్మెల్యే, ఎంపీ తదితర నేతలు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. తమకు వలసవాదులేనటువంటి ఎమ్మెల్యే, ఎంపీల ద్వారా కూడా అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. అనధికార మున్సిపాలిటీ ద్వారా తమ జాతికి అడుగడుగునా అన్యాయం జరుగుతుందని చెప్పారు. ఇక్కడికి వచ్చిన నిధులు వలసదారులు ఎత్తుకుపోతున్నారని విచారణ వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వట్టెం కన్నయ్య, ఎస్ వెంకటరత్నం, పెద్ది భార్గవ్, భీమిని సంజీవ్, మేసినేని పోశం, ఈసం కృష్ణ లు పాల్గొన్నారు.

## వివిధ పార్టీల నుంచి బిజెపిలో చేరిన యువకులు

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు**



**రాజేంద్రనగర్, మహా ;** రాజేంద్రనగర్ నియోజక వర్గ పరిధిలోని ఉప్పరపల్లి హైదర్ గూడా డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నుంచి 50 మంది యువకులు బిజెపి నియోజకవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం భారతీయ జనతా పార్టీలో చేరారు. రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, వీరేందర్ గౌడ్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల మాట్లాడుతూతెలంగాణ వ్యాప్తంగా యువకులు బిజెపి పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. భవిష్యత్తులో మరిని చేరికలు ఉంటాయన్నారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేస్తున్న సంస్కరణలు అభివృద్ధిని చూసి మిగతా పార్టీలో ఉన్న యువకులు భారతీయ జనతా పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

## ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**ఇబ్రహీంపట్నం ఆర్డిఓ అనంతరెడ్డి.. ఆహార భద్రత పై అవగాహన ర్యాలీ**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తుందని ఆర్డిఓ అనంతరెడ్డి అన్నారు. సోమవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కేంద్రంలో ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆహార భద్రత అవగాహన కార్యక్రమంలో ఆర్డిఓ అనంతరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన అనంతరం ఇబ్రహీంపట్నం పాత పోలీస్ స్టేషన్ బస్తీ దవఖాన నుంచి సర్కార్ దవఖాన వరకు, మున్సిపల్ కమిషనర్ సుదర్శన్, డాక్టర్లు, విద్యార్థులతో కలిసి, వైద్యం ఆరోగ్యం ఆహార భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్యం ఆరోగ్యం అందజేయాలని ప్రతిష్టాత్మకంగా పలు కార్యక్రమాలు చేపడుతుంది. ఆహార భద్రతపై ప్రభుత్వం అవగాహన కల్పించడం ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో డాక్టర్లు సూచించినట్లు తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రత్యేకంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు పోషకాలతో కూడిన పౌష్టికాహారాలు అందిస్తుందని, విద్యార్థులు ఈ యొక్క మెనూను సద్వినియోగం చేసుకొని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విద్యలో క్రీడా రంగాలలో చక్కగా రాణించాలని ఆర్డిఓ అనంతరెడ్డి విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఐసిడిఎస్ అధికారులు, ప్రజలు, విద్యార్థులు, అంగన్వాడి టీచర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిధుల కోసం సీఎంకు ఆదిలాబాద్ నేతల వినతి పత్రం



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణాభివృద్ధికి తగిన విధంగా నిధులు కేటాయించి సహకరించాలని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డితో కలిసి సీయం కు వినతి పత్రమిచ్చారు. సోమవారం బజార్ హత్నూర్ మండలం పిప్రి లో సీయం సభకు హాజరై సభ అనంతరం సీయం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించారు. అభివృద్ధికి కావలసిన నిధులు పూర్తి నివేదికలతో అందించారు.

## ప్రజల కిచ్చిన మాట నెరవేర్చుతాం-భట్టి విక్రమార్క

**ఆదిలాబాద్ మహా :** పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో ప్రజల కిచ్చిన హామీలు అమలు చేద్దామని సీయం రేవంత్ రెడ్డి తనతో చెప్పారని అందుకు పిప్రి లోసభ ఏర్పాటు చేయాలని చెప్పినట్లు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. మొత్తంగా 1232కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నందుకు ప్రజల తరపున ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. తాము పాలకులం కాదు ప్రజలకు సేవకులమన్నారు. అధికారం అంటే హోదా అనే ఉద్దేశం సీయంలో కాని తమ క్యాబినెట్ లో లేదన్నారు..ఇచ్చిన గ్యారెంటీలలో 99 శాతం అమలు చేసిన ప్రభుత్వం తమదన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చడానికి 22వేల 5వందల కోట్లతో ఇందిరమ్మ ఇండ్లకు పూనుకున్నామన్నారు.52లక్షల కుటుంబాలకు ఉచిత కరెంట్ ఇస్తున్నామన్నారు. సామాజిక అంతరాలు లేనివిధంగా సామాజిక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు 2వందల కోట్లతో శంఖుస్థాపన చేసామన్నారు.దేశంలో ఎక్కడా లేని విధంగా ఇలాంటి స్కూళ్లు రాష్ట్రంలో వంద వరకు నెలకొల్పాలన్నుద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. పేదల ప్రజలను దృష్టిలో పెట్టుకునే ఆరు గ్యారెంటీల రూపకల్పన జరిగిందన్నారు. మహిళల ఆర్థిక స్వాలంబన కోసం లక్ష కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు ఇస్తుందన్నారు సీయం చెప్పినట్టు కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడము లక్ష్యమన్నారు.

## ఇంకా అభివృద్ధి చేస్తాం-జూపల్లి

**మహా:** దశాబ్ద కాలంగా తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 8లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వారు చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ కూడా ఎక్కడా అభివృద్ధిని ఆపడంలేదన్నారు. సంక్షేమ పథకాలను నిధులు మంజూరు చేస్తూనే ఉందన్నారు. ఆలయాల అభివృద్ధి , ప్రాజెక్టులు చేపడుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చిందని తెలిపారు. రానున్న మూడేళ్లలో కూడా ఇంకా అనేక అభివృద్ధి ని ప్రజలు చూస్తారన్నారు.

## మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సీఎం రేవంత్ రెడ్డి



**ఆదిలాబాద్ మహా:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీ దేవాలయాన్ని సందర్శించారు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం తన మనవడికి సరస్వతీ క్షేత్రంలో అక్షరాభ్యాసం చేయించారు. మనవడిని ఒళ్ళో కూర్చోబెట్టుకుని పలక పై అక్షరాలు శ్రీకారం దిద్దించారు.

## ఉపాధి హామీ పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలి

మంచిర్యాలజిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి



**బెల్లంపల్లి, మహా:** ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతి గ్రామీణుడు సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల జిల్లా డిసీసీ ఉపాధ్యక్షులు శమసూరం రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆర్థిక సంవత్సరం మొదటిపనులు మాదారంగ్రామ పంచాయతీ పరిధిలో సోమవారంరోజు ప్రారంభం కాగా జిల్లాకాంగ్రెస్ పార్టీఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూరం రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే ఉపాధి హామీ పనులను జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని,ఎవరికైతే జాబ్ కార్డు లేకుండా ఉన్నవారు ఉంటే జాబ్ కార్డు కు అప్లై చేసుకోవాలని తెలిపారు.అదే విధంగా ఉపాధి హామీ పనులకు హాజరయ్యే వారికి త్రాగు నీరు అందించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్, ఉపసర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి,వార్డ్ మెంబర్ లక్ష్మీ, కాంగ్రెస్ నాయకులు మీస శంకర్, మీనుగు క్రిష్ణ,బుతుకూరి కమలాకర్, పుప్పాల శ్రీనివాస్,ఇప్ప శంకర్,సిరికొండ సత్యనారాయణ, టి. ఈ. సందీప్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్,మెట్ పుష్ప , ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్థిక అంశాలపై విద్యార్థులకు విశ్లేషణ

- హాజరైన చెన్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చరర్ జి. ముకుంద్
- అకాడమిక్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించాం: ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్



**బెల్లంపల్లి,మహా:** ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఆర్థిక అంశాలనిర్వహణపై విద్యార్థులకు విశ్లేషణాత్మకమైన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు.202526 అకాడమిక్ కార్యక్రమంలోభాగంగా కామర్స్ విభాగంలోని విద్యార్థుల కోసం ఏర్పాటు చేశారు.ఈ ఎక్స్టెన్షన్ లెక్చర్ ఇవ్వడానికి రిసోర్స్ పర్సన్ గా చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు జీ. ముకుంద్ హాజరయ్యారు.'ఫైనాన్స్' అనే అంశం గురించి విస్తృతమైనటువంటి విషయాలు విద్యార్థులకు వివరించారు.ఫైనాన్స్ అనే అంశం చుట్టూ ముడిపడిఉన్న విశేషాలను కాంగ్రెస్ విద్యార్థులు తెలుసుకోవలసిన ఆవశ్యకతను వివరించారు.విద్యార్థులు పలు వివరాలు లెక్చరర్ ను అడిగి తెలుసుకున్నారు.ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కాంపల్లి శంకర్వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, కామర్స్ విభాగం అధ్యాపకులు రఫిక్, రవి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య పరీక్షలు



**ఆలేరు, మహా:**ప్రజలు ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ఉపయోగించుకొవాలని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్ అన్నారు...నేడు ఆలేరు మున్సిపాలిటీ ఒక్కటవ వార్డ్ సబ్ సెంటర్ లో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికా లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరాన్న చైర్మన్ బాలమణి ప్రారంభించారుప్రజలకు బిపి,షుగర్, పాటు టీబీ,క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మౌనిక,మల్లెల సరిత,జూకంటి సంపత్ ,డాక్టర్ హైమావతి,డాక్టర్ సరిత,యాకయ్య,ANM లు సువర్ణ, మరియమ్మ,సత్యవతి,సువర్ణ,విజయ లక్ష్మీ, మాధవి పాల్గొన్నారు...

## భరోసా సెంటర్ ను ప్రారంభించిన డి.జి.పి శివధర్ రెడ్డి, అడిషనల్ డి. జి.పి మహేష్ భగవత్.



**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ లతో కలిసి రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ,అడిషనల్ డీజీపీ (లా & ఆర్డర్) మహేష్ ఎం. భగవత్ సోమవారం భరోసా సెంటర్ను ప్రారంభించారు.అనంతరం డి.జి.పి జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి డిజిపి మాట్లాడుతూ..., పోలీస్ శాఖకు ప్రస్తుతం సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ వంటి సవాళ్లు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడంలో పోలీస్ అధికారులు ముందుండాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణలో మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తదుపరి జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన జిల్లా పోలీస్ కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్మశాన వాటికలు ఉన్న.. ఉపయోగమేమి..

**సిపిఎం సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు**

**వలిగొండ, మహా:** గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో లక్షల రూపాయలు వెచ్చించి స్మశానవాటికలు వైకుంఠధామాలు నిర్మించినప్పటికీ అందులో ఉండాల్సిన సౌకర్యాలు లేక నేడు వెలవెలబోతున్నాయని సిపిఎం సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గోపరాజుపల్లి గ్రామంలోఇటీవల ఒక వ్యక్తి మరణించగా స్నానాల కోసం స్మశాన వాటికలో స్త్రీలకు పురుషులకు వేరు వేరు స్నానాల గదులు ఉండగా వాటిలో నీటి సౌకర్యం లేక ఆరుబయటే స్నానాలు చేయాల్సి వచ్చిందని దీనితో అక్కడికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆయన అన్నారు. ఇప్పుడైనా అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి తగిన పరిష్కారం చూపగలరని ఆయన అధికారులకు విన్నవించారు.

## బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

**బుచ్చయ్యపల్లి సర్పంచ్ జాడిమహేష్ పుట్టినరోజు సందర్భంగా...**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలంలోని బుచ్చయపల్లి గ్రామ సర్పంచ్ జాడి మహేష్ పుట్టినరోజు వేడుక శ్రీ బుగ్గ రాజ రాజేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారంనాడు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయఅర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్మన్ దావ స్వాతి రమేష్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కార్కూరి రాంచందర్,టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరిస్వామి, దేవాదాయకమిటీచైర్మన్ దూడం మహేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులుదుర్గం గోపాల్,అధికార ప్రతినిధి బత్తుల రవి, నాయకులు ముత్తె భూమన్న, ఎంబడి సురేష్ ,అసంపల్లి నర్సయ్య, బండి లక్ష్మణ్,మూర్తి, శ్యామ్,యూత్ కాంగ్రెస్ నాయకులు వంశీ, బమండ్లపల్లి భరత్, కనుకుంట్ల రాకేశ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## చదువుతోపాటు విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులు



**మంచిర్యాల, మహా :** లక్షెట్టిపేట పీఎం సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల,జూనియర్ కళాశాలలో చదువుతోపాటు విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులు నేర్పిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రమా కల్యాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ చదువుతున్న విద్యార్థులకు చదువుతో పాటు ఒకేషనల్ ట్రైనర్ల ద్వారా వృత్తి విద్య కోర్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఒకేషనల్ ట్రైనర్లు విద్యార్థులకు ఎలక్ట్రానిక్స్, బ్యూటీ అండ్ వెల్నెస్ వృత్తి విద్యా కోర్సులు నేర్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు పూర్తి అవడంతో వారికి ప్రభుత్వం ఇంటర్నెట్ షిప్ కార్యక్రమం ద్వారా వారికి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, కంప్యూటర్ హార్డ్వేర్, బ్యూటీ అండ్ వెల్నెస్ సెంటర్లలో 10 రోజుల పాటు ఇంటర్న్ షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు. ప్రతిరోజు ఆ శిక్షణ ఇంటర్న్ షిప్ సెంటర్లను ఒకేషనల్ ట్రైనర్ లు శిరీష, నిర్మల లు సందర్శిస్తారని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు ఈ వృత్తి విద్య శిక్షణ కోర్సుల నేర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో వారు తమ జీవనోపాధి కోసం ఆదాయవనరులు ఏర్పాటు చేసుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 57 అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 35, జిల్లా గ్రామీణ అభివృద్ధి 8, ఉపాధి కల్పన 2, మున్సిపాలిటీ 2, పంచాయతీ 2, విద్య, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ ,దేవాదాయ, ఆర్.టి.సి , చేనేత, నేషనల్ హైవే, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ, జెడ్పీ సి.ఈ.ఓ శోభారాణి , జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్మశాన వాటిక... సమస్యల వేదిక

**అక్కరకు రాని స్మశాన వాటిక స్నానపు గదులు.. సమస్యను తీర్చాలని గ్రామస్తుల వినతి**





**వలిగొండ, మహా:**ప్రజలకు లబ్ధి చేకూర్చడమే పథకాల లక్ష్యం. దీని కోసం ప్రభుత్వం రూ. లక్షల్లో నిధులు కేటాయిస్తోంది. కానీ కొంత మంది నిర్లక్ష్యం.. ప్రణాళికలేమి కారణంగా కొన్ని నిరుపయోగంగా మారుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల లోని గోపరాజుపల్లి గ్రామంలోరూ. లక్షల ప్రజాధానం వృథా అవుతోంది. జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన శ్మశావాటికలు అదే కోవలోకి వస్తాయి. కనీసం విద్యుత్తు సరఫరాలేక, నాసిరకం నిర్మాణాలు, వాటిని వాడుకోవడానికి కూడా కనీస సదుపాయాలు లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మించారు. దీంతో చాలా చోట్ల అవి వినియోగించలేని పరిస్థితి నెలకొంది.

**నిధులు వరద పాలు**

లక్షలు ఖర్చుపెట్టి ప్రజలకు అక్కరకు వస్తాయని నిర్మించిన స్నానపు గదులలో నీటి వసతి లేక ఆడవారు బయట స్నానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు.గ్రామ పంచాయతీల్లో శ్మశాన వాటికలు నిర్మించారు. ఒక్కో దానికి లక్షలు ఖర్చు చేశారు. క్షేత్రస్థాయిలో వీటి నిర్వహణ లేక ఎందుకు పనికి రాకుండా ఉన్నాయి. అధికారుల స్పందించి అన్ని వసతులు కల్పించి ప్రజలకు వినియోగించేలా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**సమస్యను పరిష్కరిస్తాం: ఎంపీడీవో జలంధర్ రెడ్డి**

గోపరాజు పల్లి లోని స్మశాన వాటిక సమస్యను మహా న్యూస్ ప్రతినిధి మండల ఎంపీడీవో జలంధర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే స్మశాన వాటిక లోని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన వివరణ ఇచ్చారు.

## ఘనంగా భారతీయ జనతా పార్టీ 46 ఆవిర్భావ దినోత్సవం



**సదాశివపేట, మహా :**సదాశివపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో మండల పార్టీ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ జెండా ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కరణం ఆదిత్య గ మాట్లాడుతూ ఎందరో కార్యకర్తల బలిదానాల పునాదులపై నిర్మితమై క్రమశిక్షణ అంకితభావానికి ప్రతిరూపమై దేశాభివృద్ధి యజ్ఞంలో నిమగ్నమై ప్రపంచలో అతి పెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శిలు నామ హరీష్, ఉక్కిస భరత్, జిల్లా నాయకులు సారా కృష్ణ, అంబదాస్, జగన్నాథ్ రెడ్డి , మండల నాయకులు శ్రీకాంత్, సుభాన్, లక్ష్మణ్ , అంబదాస్, ప్రసాద్, నాగరాజు, ప్రశాంత్, దుర్గరాజ్, అనిల్, మల్లేశం, నితీష్, సాకేత్, మల్లేష్, గోపాల్ శివ, శ్రీకాంత్, మాణిక్యం బూత్ అధ్యక్షులు సురేష్, సత్యనారాయణ మరియు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# కమల వికాసం..

## అప్రతిహత రాజకీయ ప్రస్థానం!.. శూన్యం నుంచి శిఖరాగ్రానికి సాగిన ప్రస్థానం

భారత రాజకీయ యవనికపై ఒకనాడు కేవలం రెండు పార్లమెంట్ స్థానాలకే పరిమితమై, ప్రత్యర్థుల హేళనలకు గురైన ఒక చిన్న రాజకీయ విత్తనం..నేడు దేశపు భౌగోళిక పటాన్ని కాషాయ వర్ణంతో ముంచెత్తుతూ, ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ శక్తిగా ఆవిర్భవించడం ఒక అసాధారణ పరిణామం. భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం కేవలం ఒక పార్టీ వార్షికోత్సవం మాత్రమే కాదు; అది భారత ప్రజాస్వామ్య చరిత్రలో సిద్ధాంతం ప్రాతిపదికన నిర్మితమైన ఒక అప్రతిహత సామ్రాజ్య విస్తరణకు సజీవ సాక్ష్యం. 1980 ఏప్రిల్ 6న ముంబై తీరాన అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్.కె. అద్వానీల సారథ్యంలో ఆవిర్భవించిన నాటి కమల దళం..నేడు నరేంద్ర మోడీ రూపంలో ఒక అజేయ నాయకత్వాన్ని సంతరించుకుంది. నాడు వాజ్‌పేయి గారు భవిష్యత్తును దర్శిస్తూ అన్నట్లుగా 'అంధకారం తొలగిపోతుంది, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది' అన్న మాటలు నేడు అక్షర సత్యాలయ్యాయి.





### సిద్ధాంత వైభవం,అద్వానీ రథయాత్ర

బీజేపీ విజయ రహస్యం కేవలం అధికార కాంక్ష కాదు; అది దీన్ దయాళ్ ఉపాధ్యాయ అందించిన 'ఏకాత్మ మానవతావాదం' మరియు 'అంత్యోదయ' అనే బలమైన సిద్ధాంత పునాదులపై నిర్మించబడింది. 1990లలో ఎల్.కె. అద్వానీ చేపట్టిన సోమనాథ్ నుంచి అయోధ్య రథయాత్ర భారత రాజకీయాల్లో హిందుత్వ అజెండాను చర్చాంశనీయం చేయడమే కాకుండా, పార్టీని సామాన్య ప్రజల దరికి చేర్చింది. మూడు పర్యాయాలు పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి, సుదీర్ఘ కాలం ఆ పదవిలో కొనసాగిన అద్వానీ గారు పార్టీకి ఒక సంస్థాగత రూపాన్ని ఇచ్చారు. 1996లో తొలిసారి 13 రోజుల ప్రభుత్వం నుంచి, ఆపై 1999లో పూర్తి కాలం ప్రభుత్వాన్ని నడిపిన వాజ్‌పేయి కాలం సంకీర్ణ ధర్మానికి ఒక పాఠంలా నిలిచింది. పోఖ్రాన్ అణు పరీక్షలు, కార్గిల్ విజయం వంటి ఘనతలతో దేశాన్ని ప్రపంచ పటంలో గౌరవప్రదమైన స్థానంలో నిలిపిన ఘనత నాటి వాజ్‌పేయిఅద్వానీ ద్వయానిదే.

### మోడీ శకం, నూతన రికార్డుల సృష్టి

2014వ సంవత్సరం భారత రాజకీయాల్లో ఒక చారిత్రాత్మక మలుపుగా నిలిచింది. గుజరాత్ అభివృద్ధి నమూనాను దేశవ్యాప్తంగా పరిచయం చేస్తూ నరేంద్ర మోడీ రంగప్రవేశం చేయడంతో బీజేపీ గమనం పూర్తిగా మారిపోయింది. సంకీర్ణ రాజకీయాల గందరగోళం నుంచి దేశానికి విముక్తి ప్రసాదిస్తూ, వరుసగా మూడు సార్లు స్పష్టమైన మెజారిటీతో అధికారాన్ని నిలబెట్టుకోవడం వెనుక మోడీ చరిష్మాతో పాటు అమిత్ షా మార్క్ చాణక్యం దాగి ఉంది. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును సమం చేస్తూ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టడం ద్వారా మోడీ గారు దేశ ప్రజల అచంచల విశ్వాసాన్ని చూరగొన్నారు. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం వంటి దశాబ్దాల కలలను సాకారం చేయడంలో ఈ ప్రభుత్వం చూపిన తెగువ సామాన్యమైనది కాదు.

### భౌగోళిక ప్రాబల్యం, సామాజిక విస్తరణ

నేడు దేశంలోని 21 రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలన సాగుతోంది. కేవలం 'హిందీ బెల్ట్' పార్టీగా ఉన్న ముద్రను చెరిపేస్తూ, ఈశాన్య రాష్ట్రాల్లో జైత్రయాత్ర సాగించడం మరియు పశ్చిమ బెంగాల్‌ను ఒక డ్రీమ్ స్టేట్‌గా మార్చుకోవడం పార్టీ ఎదుగుదలకు నిదర్శనం. దేశ జనాభాలో సుమారు 70 శాతం మంది నేడు కాషాయ పాలనలో ఉండటం గమనించాల్సిన విషయం. బ్రాహ్మణబనియా పార్టీ అన్న విమర్శల నుంచి బయటపడి వెనుకబడిన తరగతులు, గిరిజన మరియు దళిత వర్గాలను పార్టీలోకి భారీగా చేర్చుకోవడం ద్వారా బీజేపీ తన సామాజిక పునాదిని అద్భుతంగా విస్తరించుకుంది. పన్నా ప్రముఖ్ నుంచి జాతీయ అధ్యక్షుడి వరకు ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయడమే ఈ ఎన్నికల యంత్రం విజయ రహస్యం. ముఖ్యంగా గుజరాత్, మధ్యప్రదేశ్ మరియు బీహార్ రాష్ట్రాలు పార్టీకి అత్యంత బలమైన రాజకీయ కోటలుగా మారాయి.

### భవిష్యత్తు లక్ష్యాలు, 2047 సంకల్పం

భారతదేశం 2047 నాటికి 'వికసిత్ భారత్'గా ఎదగాలన్న సంకల్పంతో బీజేపీ తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. సిద్ధాంత వైభవం నుంచి అధికార ప్రాభవం వైపు సాగిన ఈ ప్రయాణంలో బీజేపీ తన మూలాలను మరువకుండా ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో అగ్రగామిగా నిలవాలి. దక్షిణాది రాష్ట్రాల్లో తన ముద్రను మరింత బలోపేతం చేసుకోవడం మరియు ప్రాంతీయ అస్తిత్వాలను గౌరవిస్తూనే జాతీయ ప్రయోజనాలను కాపాడటం ఈ మహాశక్తి ముందున్న అసలైన పరీక్ష. లోక్‌సభలో రెండు స్థానాల నుంచి ప్రారంభమై నేడు దేశాన్ని శాసించే స్థాయికి ఎదిగిన ఈ 47 ఏళ్ల ప్రస్థానం భారత ప్రజాస్వామ్యపు అచంచల గమనానికి ఒక సజీవ సాక్ష్యం. విభిన్న సవాళ్లను ఎదుర్కొంటూనే నవ భారత నిర్మాణంలో భాగస్వామి కావడమే ఈ కమల వికాసపు అంతిమ లక్ష్యం.

- గడల నరసింహారావు,
సీనియర్ జర్నలిస్ట్, ఖమ్మం.

# రోజూ ఎక్కువ సేపు కూర్చుంటున్నారా?

## గుండెపోటు ముప్పు రెట్టింపు అవుతుందంటున్న నిపుణులు

ఆధునిక జీవనశైలిలో మనం తెలియకుండానే అలవాటు చేసుకున్న ఒక ప్రమాదకరమైన అలవాటు మన గుండె ప్రాణాలకే ముప్పు తెస్తోంది. చాలా మంది ధూమపానం, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్లనే గుండె జబ్బులు వస్తాయని అనుకుంటారు. కానీ, ఏమీ చేయకుండా గంటల తరబడి ఒకే చోట కూర్చోవడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం రెట్టింపు అవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



కాలిఫోర్నియాకు చెందిన ప్రముఖ గుండె జబ్బుల నిపుణులు (కార్డియాలజిస్ట్) డాక్టర్ సంజయ్ భోజ్రాజ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఈ ఆందోళనకరమైన విషయాన్ని వెల్లడించారు. గుండె సంబంధిత వైద్య రంగంలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఆయన, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న అతి పెద్ద ఆరోగ్య సమస్య కదలకుండా ఒకే చోట కూర్చోవడమేనని స్పష్టం చేశారు.

"ఈ అలవాటు వల్ల గుండెపోటు ముప్పు రెండొంతలు పెరుగుతుంది, దీని గురించి చాలా మంది అస్సలు ఆలోచించరు," అని డాక్టర్ భోజ్రాజ్ స్పష్టమైన హెచ్చరిక చేశారు.

"రెండు దశాబ్దాలకు పైగా నా వైద్య వృత్తిలో ఎన్నో కేసులను చూశాను. వాటన్నింటిలోనూ ఎక్కువగా కనిపించే ఒకే ఒక్క అలవాటు ఏమిటంటే, ప్రజలు తగినంతగా శారీరక కదలికలు లేకపోవడం. గంటల తరబడి కూర్చోవడం వల్ల రక్తప్రసరణ నెమ్మదిస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి, రక్తం గడ్డకట్టే ప్రమాదం ఎక్కువవుతుంది. ఇలాగే గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి" అని ఆయన వివరించారు.

దీనికి పరిష్కారం కోసం జిమ్‌లో గంటల తరబడి కష్టపడాల్సిన అవసరం లేదని డాక్టర్ భోజ్రాజ్ సూచించారు. మన రోజువారీ అలవాట్లలో చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుందని చెప్పారు.

"ప్రతి 30 నుంచి 60 నిమిషాలకు ఒకసారి మీ సీట్లో నుంచి లేచి నిలబడండి. కాసేపు నడవండి. కొన్ని స్క్వాట్స్ తీయండి. ప్రతిరోజూ మీ శరీరానికి ఏదో ఒక రూపంలో కదలిక ఉండేలా చూసుకోండి. ఇది చాలా సులువైన మార్గం" అని ఆయన సలహా ఇచ్చారు.

### డబ్ల్యూహెచ్‌వో నివేదికలు చెప్పేది కూడా ఇదే..

డాక్టర్ భోజ్రాజ్ చేస్తున్న ఈ హెచ్చరికలను ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) గణాంకాలు కూడా బలపరుస్తున్నాయి. 2024 లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, శారీరక శ్రమ లేకపోవడం అనేది ప్రాణాంతక వ్యాధులకు దారితీసే ప్రధాన కారణాలలో ఒకటిగా మారింది.

సరిపడా శారీరక శ్రమ లేని పెద్దవారిలో, చురుకుగా ఉండే వారితో పోలిస్తే మరణించే ముప్పు 20 నుంచి 30 శాతం ఎక్కువగా ఉంటుందని డబ్ల్యూహెచ్‌ఓ వెల్లడించింది. ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం వల్ల రక్తపోటు (బీపీ), ఊబకాయం వంటి సమస్యలు వస్తాయని, ఇవే గుండె వైఫల్యానికి తొలి మెట్లు అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

అంతేకాకుండా, 2022లో డబ్ల్యూహెచ్‌ఓ ప్రస్తావించిన ఒక అధ్యయనం ప్రకారం, ఇలాంటి నిశ్చల జీవనశైలి కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 27 బిలియన్ డాలర్ల (భారతీయ కరెన్సీలో లక్షల కోట్లు) వైద్య ఖర్చులు పెరుగుతున్నాయి. శారీరక శ్రమ లేకపోవడం వల్ల టైప్2 డయాబెటిస్, గుండె జబ్బులు వేగంగా పెరుగుతున్నాయి.

ఎక్కువ సేపు కూర్చోవడం వల్ల శరీరంలో 'మెటబాలిక్ స్లోడౌన్' (జీవక్రియలు మందగించడం) ఏర్పడుతుందని వైద్యులు వివరిస్తున్నారు. శరీరం కదలకుండా ఉన్నప్పుడు, రక్తంలో ఉండే కొవ్వులను (లిపిడ్స్) కరిగించే ఎంజైమ్‌ల ఉత్పత్తి తగ్గిపోతుంది. మన ఆధునిక జీవనశైలి అంతా కంప్యూటర్ టేబుళ్లు, సోఫాలకే పరిమితమైంది. ఇది మానవ శరీర తత్వానికి ఏమాత్రం సరిపడదని వైద్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రస్తుతం హైదరాబాద్ వంటి నగరాల్లో ఐటీ ఉద్యోగులు, డెస్క్ జాబ్స్ చేసే వారు రోజుకు ఎనిమిది నుంచి పది గంటలు ఒకే చోట కూర్చుని పనిచేస్తున్నారు. మన తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ విధమైన జీవనశైలి వల్ల చిన్న వయసులోనే గుండె జబ్బుల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ హెచ్చరికలను ప్రతి ఒక్కరూ గమనించాలని వైద్యులు సూచిస్తున్నారు.

### తరచుగా అడిగే ప్రశ్నలు

**ప్రశ్న 1: ఎంతసేపు కూర్చుంటే గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది?**
**సమాధానం:** గంటల తరబడి కదలకుండా ఒకే చోట కూర్చోవడం వల్ల రక్తప్రసరణ మందగించి, గుండెపోటు ముప్పు రెట్టింపు అవుతుంది.

**ప్రశ్న 2: దీని నుంచి బయటపడటానికి ఏం చేయాలి?**
**సమాధానం:** ప్రతి 30 నుంచి 60 నిమిషాలకోసారి సీటు నుంచి లేచి కాసేపు నడవడం, చిన్నపాటి వ్యాయామాలు చేస్తూ శరీరానికి తగిన శ్రమ కలిగించడం చేయాలి.

**ప్రశ్న 3: శారీరక శ్రమ లేకపోవడం వల్ల ఇతర నష్టాలు ఏమిటి?**
**సమాధానం:** దీనివల్ల ఊబకాయం, అధిక రక్తపోటు, టైప్-2 మధుమేహం (డయాబెటిస్) వంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయి.

# ఏప్రిల్ 10 నుంచి నో టోల్ బ్రేక్




దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల మీద ప్రయాణించే వాహనదారులకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అత్యంత కీలకమైన సమాచారాన్ని అందించింది. హైవేలపై ప్రయాణాన్ని మరింత సులభతరం చేస్తూ, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీని పూర్తిగా తగ్గించే లక్ష్యంతో ఎన్‌హెచ్‌ఏఐ ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఏప్రిల్ 10వ తేదీ నుంచి దేశంలోని ఏ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద కూడా నగదు చెల్లింపులను అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు ఫాస్టాగ్ లేని వారు లేదా బ్యాలెన్స్ లేని వారు జరిమానాతో కూడిన నగదును చెల్లించే వెసులుబాటు ఉండగా, ఇకపై ఆ విధానానికి పూర్తిగా స్వస్తి పలకనున్నారు. ఏప్రిల్ 10 నుంచి టోల్ ప్లాజాల వద్ద కేవలం డిజిటల్ పద్ధతుల్లో మాత్రమే టోల్ వసూలు చేయాలని అన్ని ప్రాంతీయ కార్యాలయాలకు ఎన్‌హెచ్‌ఏఐ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. డిజిటల్ ఇండియాలో భాగంగా రవాణా రంగాన్ని పూర్తిగా నగదు రహితంగా మార్చడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని అధికారులు వెల్లడించారు. టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపుల వల్ల చిల్లర సమస్యలు తలెత్తడమే కాకుండా, ఒక్కో వాహనం నిమిషాల తరబడి వేచి చూడాల్సి వస్తోంది. దీనివల్ల ఇంధనం వృథా అవ్వడంతో పాటు వాతావరణ కాలుష్యం కూడా పెరుగుతోంది. తాజా నిర్ణయంతో వాహనాలు టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండానే సెన్సార్ల ద్వారా లేదా జియో ఫెన్సింగ్ టెక్నాలజీ ద్వారా టోల్ కట్ అయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫాస్టాగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూనే, భవిష్యత్తులో గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (GNSS) ఆధారిత టోలింగ్‌కు పునాది వేసేందుకే ఈ నగదు రహిత నిబంధనను తీసుకువచ్చినట్లు తెలుస్తోంది.

ఈ కొత్త నిబంధన అమలులోకి వచ్చిన తర్వాత, వాహనంలో ఫాస్టాగ్ లేకపోయినా లేదా పనిచేయకపోయినా నగదు ఇచ్చి వెళ్తామంటే కుదరదు. అటువంటి వాహనదారులకు ప్రత్యామ్నాయ డిజిటల్ వాలెట్లు లేదా స్పాట్ రీఛార్జ్ పాయింట్ల ద్వారా మాత్రమే చెల్లింపులు చేసే అవకాశం కల్పిస్తారు. ఏప్రిల్ 10 నుంచి ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని, ఎటువంటి మినహాయింపులు ఇవ్వకూడదని కేంద్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీనివల్ల టోల్ వసూళ్లలో పారదర్శకత పెరుగుతుందని, ఆదాయం నేరుగా ప్రభుత్వ ఖజానాకు చేరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనాలు ఫాస్టాగ్ విధానంలోకి మారిన నేపథ్యంలో, మిగిలిన స్వల్ప శాతాన్ని కూడా డిజిటల్ వైపు మళ్లించేందుకు ఈ గడువును నిర్ణయించారు.

వాహనదారులు ప్రయాణానికి ముందే తమ ఫాస్టాగ్ వాలెట్లలో సరిపడా నగదు ఉందో లేదో తనిఖీ చేసుకోవాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 10 నుంచి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్లాజాల వద్ద నగదు కౌంటర్లను తొలగించి, వాటి స్థానంలో సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. రహదారులపై ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు, ప్రయాణ సమయాన్ని ఆదా చేసేందుకు ఎన్‌హెచ్‌ఏఐ తీసుకుంటున్న ఈ నిర్ణయం రియల్ టైమ్ డేటా నిర్వహణకు కూడా ఎంతో దోహదపడనుంది. మొత్తం మీద ఏప్రిల్ 10 నుంచి భారత జాతీయ రహదారులు పూర్తి స్థాయిలో 'డిజిటల్ హైవేలు'గా రూపాంతరం చెందనున్నాయి.

## ఘనంగా బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**బూర్గంపహాడ్, మహా :** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బూర్గంపాడు మండల పరిధిలోని పినపాక పట్టినగర్ 238వ బూత్‌లో ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మేకల నరసింహరావు, నాయకులు రెంటాల నాగేశ్వరరావు కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా బీజేపీ సాధిస్తున్న విజయాలను, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.46 ఏళ్ల క్రితం స్థాపించబడిన బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందని వారు పేర్కొన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బీరక



సాయి శ్రీను, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బానోత్ వెంకటేష్, జిల్లా నాయకులు బుద్ధ ధర్మరాజు, బూత్ అధ్యక్షులు రెంటాల పవన్ కుమార్, అలాగే కార్యకర్తలు తేజవత్ వెంకటేశ్వర్లు, కొట్టే వెంకటేశ్వర్లు, మేకల రాంబాబు, ఆర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మారిన వాతావరణం...
# రైతన్న గుండెల్లో గుబులు

**అధికారులు సహకరించాలని రైతుల విజ్ఞప్తి**

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండల కేంద్రంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పు చోటుచేసుకుంది. ఈ మార్పుతో రైతుల గుండెల్లో ఆందోళన మొదలైంది.మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన తొలి ధాన్యాన్ని ఆరబెట్టడంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకస్మాత్తుగా వర్షం వచ్చే అవకాశాలు ఉండటంతో పంట నష్టపోతుందనే భయం రైతులను వెంటాడుతోంది.ముఖ్యంగా మార్కెట్ యార్డు సిబ్బంది కనీస సదుపాయాలు కల్పించకపోవడం రైతులను మరింత కష్టాల్లోకి నెడుతోంది. ధాన్యం



కాపాడుకోవడానికి అవసరమైన పరదాలు (తార్పులు) అందిఇంచాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

## బూర్గంపాడు మండల కేంద్రంలో సర్పంచ్ మందా నాగరాజు చేతుల మీదుగా నూతన చలివేంద్రం ప్రారంభం

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచ్ మందా నాగరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండె వెంకన్నతో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ప్రయాణికులు, గ్రామస్తులు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతం కావడంతో ఎండకాలంలో తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ఈ ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బర్ల ప్రభాకర్, పాలకవర్గ సభ్యులు భజన పెదనాగం, నాగ ప్రవల్లిక, నస్రిన్, గ్రామపంచాయతీ





సిబ్బంది అనిల్, దిలీప్, ఆటో స్టాండ్ కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్లక్ష్యం

**డయాలసిస్ రోగి ప్రాణాపాయం – బాధ్యులపై చర్యల డిమాండ్**

**భద్రాచలం మహా :** భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రిలో ఘోర నిర్లక్ష్యం చోటుచేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ముసలమడుగు గ్రామపంచాయతీకి చెందిన మేకల సీతమ్మ అనే డయాలసిస్ రోగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే, సీతమ్మ గత కొంతకాలంగా రోజు విడిచి రోజు ఆసుపత్రికి వెళ్లి డయాలసిస్ చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో ఈరోజు కూడా సాధారణంగా డయాలసిస్ కోసం ఆసుపత్రికి వెళ్లింది. పరీక్షల సమయంలో ఆమె శరీరంలో రక్తం తక్కువగా ఉన్నట్లు గుర్తించిన వైద్య సిబ్బంది రక్తం ఎక్కించే ప్రక్రియను ప్రారంభించారు. అయితే, రక్తం ఎక్కించే సమయంలో ఉపయోగించే పైపు అకస్మాత్తుగా తెగిపోవడంతో రక్తం బయటకు కారడం ప్రారంభమైంది. అక్కడ విధుల్లో ఉన్న నర్సులు ఈ విషయాన్ని వెంటనే గుర్తించకపోవడం వల్ల సుమారు రెండు గంటల పాటు రక్తం కారినట్లు తెలుస్తోంది.దీంతో సీతమ్మ శరీరంలో రక్తపోటు తగ్గి పరిస్థితి విషమంగా మారింది. ప్రస్తుతం ఆమె తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.ఈ ఘటనపై సీతమ్మ భర్త తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తన భార్య ప్రాణాపాయంలో పడిందని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా సంబంధిత అధికారులు తక్షణమే విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

**స్థానికుల ఆగ్రహం**

ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే పేద ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## సామాజిక కార్యకర్త దరఖాస్తుకు స్పందించిన ఆర్టీసీ అధికారులు

**బూర్గంపహాడ్ మహా :** మండల కేంద్రంలోని బస్టాండ్‌ను పునరుద్ధరించాలని కోరుతూ పాల్వంచ మండలానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త సమర్పించిన దరఖాస్తుపై తెలంగాణ ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో యారం నాగిరెడ్డి, తెలంగాణ ఆర్టీసీ రాష్ట్ర మేనేజింగ్ డైరెక్టర్, బూర్గంపహాడ్ మండల కేంద్రానికి స్వయంగా విచ్చేసి బస్టాండ్ పరిస్థితిని పరిశీలించారు. బస్టాండ్‌లో ఉన్న సదుపాయాల లోపాలు, ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రత్యక్షంగా గమనించారు. ముఖ్యంగా షెల్టర్లు, కూర్చునే ఏర్పాట్లు, శుభ్రత, తాగునీటి సదుపాయాలు వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సమాచారం.ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలంటే బస్టాండ్‌ను వెంటనే అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అధికా



రులు అభిప్రాయపడ్డారు. దీనికి సంబంధించిన నివేదికను సిద్ధం చేసి తగిన చర్యలు చేపడతామని తెలిపారు. స్థానిక ప్రజలు, ప్రయాణికులు బస్టాండ్ పునరుద్ధరణపై ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యకు ఇప్పుడు పరిష్కారం లభిస్తుందని వారు భావిస్తున్నారు.

## దేశవ్యాప్తంగా గోమాతను జాతీయ ప్రాణిగా గుర్తించాలంటూ సంతకాల సేకరణ

**భద్రాచలంలో హిందూ భక్తులతో కలిసి కార్యక్రమం నిర్వహణ**

**భద్రాచలం మహా:** దేశవ్యాప్తంగా గోమాతను జాతీయ (మాత) ప్రాణిగా గుర్తించి సముచిత స్థానం కల్పించాలనే డిమాండ్‌తో సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా భద్రాచల పట్టణంలో హిందూ భక్తులతో కలిసి విస్తృతంగా సంతకాలు సేకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, సనాతన హిందూ ధర్మంలో గోమాతకు ఉన్న విశిష్ట స్థానం గురించి ప్రజలకు వివరించారు. గోమాతను ఆరాధనీయంగా భావించే సంప్రదాయాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే దేశవ్యాప్తంగా గోవధశాలలను శాశ్వతంగా నిర్మూలించి, గోవును రక్షించేందుకు కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు



తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోమాత సంరక్షణ కోసం ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ సంతకాల సేకరణ ప్రధాన ఉద్దేశమని తెలిపారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు ఉత్సాహంగా సంతకాలు చేసి తమ మద్దతును తెలిపారు. గోమాత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు

## బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**మహా:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ వేడుకలు చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు నూప రమేష్ జెండా ఆవిష్కరణ చేశారు. బిజెపి శ్రేణులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి కంటే పార్టీ ముఖ్య మని. పార్టీ కంటే దేశం ముఖ్య మనేది బిజెపి సిధాంతం అన్నారు.ఇద్దరితో మొదలైన ప్రయాణం నేడు కోట్ల మందికి చేరువైనది అని తెలిపారు. ఓటమికి కుంగని గెలుపుకు పొంగని నాయకత్వం బిజెపి విధానం అని అన్నారు.జాతీయవాదం తమ పార్టీ లక్ష్యం అని ఆయన తెలిపారు.స్వీట్లు. బిస్కెట్లు. పంచారు. అదేవిధంగా కలివేరు గ్రామంలో క్రాస్ రోడ్ నందు పార్టీ జెండా ఎగుర వేశారు.ఈ కార్యక్ర



మం జిల్లా కార్యవర్గ సభ్యులు గునూరి రమణ. జిల్లా కౌన్సిల్ సభ్యులు బాబా ఫహీం. ఎంపీటీసీ ఇంచార్జి సరియం ధర్మరాజు కార్యదర్శులు శ్రీనివాస్ చారి.విశ్వనాధం. బంధా మధు వెంకటేష్. వినయ్.సమ్మయ్య. సందీప్.హరినాథ్. ఇర్ప సుబ్బారావు. లక్ష్మి పొడియం జోగారావు పి సుబ్బారావు సుబ్బారావు పాల్గొన్నారు.

## బి.టి. రణదేవే 36వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**చర్ల:** భారత కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనేత, కార్మికోద్యమ పితామహుల్లో ఒకరైన బి.టి. రణదేవే 36వ వర్ధంతి సందర్భంగా చర్లలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం చర్ల బీఎస్ రామయ్య భవన్‌లో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ చర్ల మండల కార్యదర్శి మచ్చ రామారావు మాట్లాడుతూ, బి.టి. రణదేవే గారు సీ ఐ టి యు అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడిగా, భారత కమ్యూనిస్టు రాజకీయ నాయకుడిగా విశిష్ట సేవలు అందించిన వ్యక్తి అని పేర్కొన్నారు. భారత కార్మికోద్యమ నిర్మాణంలో ఆయన కీలక పాత్ర పోషించారని తెలిపారు. బ్రిటిష్ పాలన కాలంలోనే బొంబాయిలో కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించిన రణదేవే, కార్మిక వర్గ హక్కుల కోసం నిరంతరం పోరాడారని అన్నారు. 1931లో గాంధీజీ బొంబాయిలో ప్రసంగిస్తున్న సందర్భంలో వేదికపైకి వెళ్లి భగత్ సింగ్ ఉరి శిక్ష, మీరట్ కుట్ర కేసు విషయాల్లో గాంధీజీ వైఖరిని బహిరంగంగా విమర్శించిన ధైర్యవంతుడని గుర్తుచేశారు.1940లో జైలు శిక్ష అనుభవిస్తున్న సమయంలో కూడా ఖైదీల సమస్యలపై పోరాడుతూ, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారని తెలిపారు. జీవితాంతం కార్మిక



వర్గ ఐక్యత కోసం కృషి చేసిన మహానేతగా ఆయనను అభివర్ణించారు.1974లో జరిగిన రైల్వే కార్మికుల సమ్మెలో దేశవ్యాప్తంగా కార్మికులను ఐక్యం చేసి పోరాటానికి నాయకత్వం వహించారని, ఆ సమ్మె భారత కార్మికోద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ శక్తులు పెరుగుతూ, పేదరికం, నిరుద్యోగం, రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విశాల కార్మిక ఉద్యమాన్ని నిర్మించడం ద్వారానే బి.టి. రణదేవే గారికి నిజమైన నివాళులు అర్పించినట్టవుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్యామల వెంకట్, మీసాల రంగారావు, విశ్వాస గోపాల్, అజిత్ తదితరులు పాల్గొన్నారు. మీకు కావాలంటే దీన్ని ఇంకా షార్ట్ న్యూస్, హెడ్‌లైన్ స్టైల్, లేదా పేపర్ ఫార్మాట్లో కూడా మార్చి ఇస్తాను.

## ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోదామును సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షణ విధానాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎంల భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ప్రతినెలా నిర్దిష్టంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా గోదాములోని భద్రతా ప్రమాణాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు.తనిఖీలో భాగంగా సీసీ కెమెరా నియంత్రణ గదిని సందర్శించిన కలెక్టర్ కెమెరాల పనితీరు రికార్డింగ్ వ్యవస్థలను స్వయంగా పరిశీలించారు. అన్ని కెమెరాలు నిరంతరం సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని ఎటువంటి లోపాలు ఉన్నా వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులకు సూచించారు.



గోదాం పరిసర ప్రాంతాన్ని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని భద్రతా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. అనుమతి లేకుండా ఎవరినీ గోదాములోకి అనుమతించకూడదని భద్రతా సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.అనంతరం గోదాం తనిఖీకి సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకం చేశారు.ఈ తనిఖీలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, అశోక్ పాల్గొన్నారు.

## మణుగూరు పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆకస్మిక తనిఖీలు..

- రాత్రి వేళ పెట్రోలింగ్ పెంచాలి..
- ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి..
- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు..

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మణుగూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు తక్షణ న్యాయం చేకూరేలా బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులపై సమగ్రంగా విచారణ జరిపి, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. డయల్ 100కు ఫోన్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా ఉండాలని సూచించారు. పెట్రోలింగ్, బ్లూ కోట్ వాహనాలతో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం



చేశారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

**కొత్త భవనం పరిశీలన..**

నిర్మాణంలో ఉన్న మణుగూరు కొత్త పోలీస్ స్టేషన్ భవనాన్ని ఎస్పీ రోహిత్ రాజ్ సందర్శించి పరిశీలించారు. పాత పోలీస్ క్వార్టర్స్ పరిసరాలను కూడా తనిఖీ చేసి అధికారులకు తగు సూచనలు చేశారు. స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఎస్‌బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ నాగబాబు, ఎస్సై శ్రావణ్ లతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల మహా జాతరకు ఆదివాసీ సంఘాలకు ఆహ్వానం

**భద్రాచలం మహా :** అల్లూరి సీతారామరాజు కాలనీలో ఏప్రిల్ 7, 8, 9 తేదీలలో నిర్వహించబడనున్న శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర సందర్భంగా, ఆదివాసీ సంఘాల ప్రతినిధులకు భద్రాచలం ఐటిడిఏ ట్రైబల్ మ్యూజియం ఆవరణలో ఆహ్వాన పత్రాలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు జాతరను ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పవిత్ర వేడుకను ఘనంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. అమ్మవార్ల కృపకటాక్షం పొందేందుకు, కోరికలు నెరవేర్చుకునేందుకు భక్తి భావాలతో జరిగే ఈ మహా జాతరకు అన్ని ప్రాంతాల భక్తులు, ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి విజయవంతం చేయాలని మన స్ఫూర్తిగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నిట్టా రాజు(10 వార్డు సభ్యులు), ఆదివాసీ సంఘాల



ప్రతినిధులు తెల్లం రమణయ్య, పాయం రవి వర్మ, పూనెం వీరభద్రం, కొండ్రు వీరస్వామి, ముర్ల రమేష్, ఈసాల కృష్ణ, జగ్గ పుల్లయ్య, వర్స వసంత్, తోకల గోపాల రావు, కళ్యాణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. జాతర కమిటీ సభ్యులు సున్నం భూలక్ష్మి (17వ వార్డు సభ్యురాలు), కుంజా సంతోష్, సవలం వంశీ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో బి.ఎస్. పి ప్రచార కరపత్రం ఆవిష్కరణ

**ఓరుగల్లు పోరు గర్జనను విజయవంతం చేయాలి**



**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణ కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో బహుజన్ సమాజ్ పార్టీ (BSP) జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన, ఈనెల 14న హనుమకొండలో జరగనున్న 'ఓరుగల్లు పోరు గర్జన' బహిరంగ సభకు సంబంధించిన ప్రచార కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని బహుజనుల హక్కుల సాధన కోసం వరంగల్ జిల్లా హనుమకొండలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి తాండ్ర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భద్రాచలం నియోజకవర్గంతో పాటు జిల్లా నలు మూలల నుండి ప్రజలు, పార్టీ శ్రేణులు వేల సంఖ్యలో తరలివచ్చి ఈ సభను జయప్రదం చేయాలని కోరారు. జిల్లాలో పార్టీ బలోపేతం మరియు రాబోయే కార్యక్రమాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా బహుజనుల గళాన్ని వినిపించేందుకు నిర్వహిస్తున్న ఈ పోరు గర్జన సభ చారిత్రాత్మకం కాబోతోందనీ. ప్రతి కార్యకర్త బాధ్యతగా ప్రజలను చైతన్యపరచాలనీ అన్నారు ఈ కార్యక్రమంలో. బీఎస్పీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జిల్లా అధ్యక్షులు తడికల శివకుమార్ బిఎస్పి జిల్లా ఉపాధ్యక్షులు సిద్ధార్థ పూలే, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా చరణ్ , జిల్లా ఈసీ మెంబర్ కేసు పాక కృష్ణ పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల నారాయణ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు ఎస్ కే భాషా, పార్టీ సీనియర్ నాయకులు చెన్నం మోహన్, భద్రాచలం పట్టణ అధ్యక్షులు మైనం ఉమామహేశ్వర రావు, పార్టీ దుమ్ముగూడెం మండల అధ్యక్షులు కొండ ప్రమోద్, పార్టీ పట్టణ మండల నాయకులు రమేష్ బాబు నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ గ్రౌండ్‌తో క్వార్టర్స్ మార్పు..

**మణుగూరు ఏరియా కౌన్సిలింగ్ కు 27 దరఖాస్తులు..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పివి కాలనీ ఎంసీ, టీ2 టైప్ క్వార్టర్స్‌కు సంబంధించిన మెడికల్ గ్రౌండ్స్‌పై చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ సోమవారం సాయంత్రం ఎస్‌ఓ టు జీఎం కార్యాలయంలో నిర్వహించారు. క్వార్టర్ ఎలాట్మెంట్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కౌన్సిలింగ్ లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రాధాన్యమిచ్చారు. ఏరియా క్వార్టర్ ఎలాట్మెంట్ కమిటీ అధికారి, ఎస్‌ఓ టు జీఎం బి శ్రీనివాస చారి సమక్షంలో జరిగిన ఈ కౌన్సిలింగ్‌లో ఎంసీ, టీ2 టైప్ పై అంతస్తుల్లో నివసిస్తున్న ఉద్యోగులు తమ కుటుంబ సభ్యుల అనారోగ్య సమస్యల కారణంగా మెట్లు ఎక్కడం, దిగడం కష్టంగా మారిందని తెలియజేస్తూ క్రింది క్వార్టర్స్ కేటాయించాలని 27 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించారు. దరఖాస్తుల్లో పేర్కొన్న అనారోగ్య కారణాలపై కంపెనీ డాక్టర్ ధృవీకరణ అనంతరం అర్హత గల ఉద్యోగుల జాబితాను రూపొందించారు. ఖాళీగా ఉన్న క్రింది



క్వార్టర్స్ ఆధారంగా సీనియారిటీ ప్రకారం కేటాయింపులు చేపడతామని అధికార ప్రతినిధి, డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డాక్టర్ రమణయ్య, ఏఐటియూసి బ్రాంచ్ సెక్రటరీ వై రాంగోపాల్, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ వి కృష్ణం రాజు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, డివై ఎస్‌ఈ (సివిల్) డివిఎస్ఎన్ ప్రవీణ్, జూనియర్ అసిస్టెంట్ జి వినయ్ కుమార్, క్వార్టర్స్ సెక్యూరిటీ సిబ్బంది బి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన లేబర్ కోడ్ లపై అధికారులకు శిక్షణ

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి సంస్థలో నూతన లేబర్ కోడ్ లను అమలు చేయుట కొరకు కొత్తగూడెం ఇల్లందు క్లబ్ నందు హెచ్ఆర్‌డి డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే శిక్షణ కార్యక్రమం సోమవారం మొదలైంది. హిందూస్థాన్ అకాడమీ ఆఫ్ లా విశాఖపట్నం ప్రొఫెసర్ వి.పార్వతీశం నూతన లేబర్ కోడ్ లను అమలు చేసే విధానాన్ని కమిటీ సభ్యులకు వివరించారు. వేతనాల కోడ్2019, పారిశ్రామిక సంబంధాల కోడ్2020, సామాజిక భద్రత కోడ్2020 ఓహెచ్ఎస్ అండ్ పని పరిస్థితుల కోడ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఏ విధమైన సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని తెలిపారు. నూతన లేబర్ కోడ్ కు సంబంధించిన అన్ని అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిఎం(హెచ్ఆర్‌డి) ఆర్.విజయ



ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో జనరల్ మేనేజర్(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు, జిఎం(ఎంపి) టి.శ్రీనివాస రావు, జిఎం(ఎంఎస్) బొజ్జ రవి, జిఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, జిఎం(ఫైనాన్స్) ఎన్.చక్రవర్తి, హెచ్ఓడి(ఐటి) బి.హరప్రసాద్, సంబంధిత అధికారులు హెచ్ఆర్‌డి డిపార్ట్మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

**రాష్ట్ర నాయకుడు కున్సోత్ ధర్మా పిలుపు**

**బూర్గంపహాడ్ మహా :** తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకుడు కున్సోత్ ధర్మా పిలుపునిచ్చారు. బూర్గంపాడు మండలం టేకులచెరువు గ్రామంలో సోమవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏప్రిల్ 23, 24, 25 తేదీలలో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొని వాటిని జయప్రదం చేయాలని కోరారు. అఖిల భారత కిసాన్ సభ రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతోందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా దేశవ్యాప్తంగా పోరాటాలు కొనసాగించామని పేర్కొన్నారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, టేకులచెరువు గ్రామంలో సుమారు 500 ఎకరాల భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ సమస్యలు ఉన్నాయని తెలిపారు. సర్వే నెంబర్లలో గందరగోళం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే సర్వే నిర్వహించి భూములకు సరైన సర్వే నెంబర్లు కేటాయించి రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఇంకా మాట్లాడుతూ, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రైతాంగాన్ని ఐక్యం చేసి, ఢిల్లీలో 13 నెలలపాటు సాగిన ఉద్యమంలో మూడు వ్యవసాయ చట్టాలను





వెనక్కి తీసుకునేలా చేయడంలో అఖిల భారత కిసాన్ సభ కీలక పాత్ర పోషించిందన్నారు. అయినప్పటికీ రైతులకు ఇంకా ముప్పు తొలగలేదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా రైతులకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర ఎం. స్. పి పంటల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. టేకులచెరువు సర్పంచ్ బోళ్ళ సైదమ్మ మాట్లాడుతూ, గ్రామపంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కనీసం 40 శాతం నిధులు విడుదల చేయాలని కోరారు.

**కొత్త కమిటీ ఎన్నిక**

ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోళ్ళ శ్రీశైలం, కార్యదర్శిగా కందుకూరి నాగేశ్వరావు, సహాయ కార్యదర్శిగా పాండవుల రావనాదం, ఉపాధ్యక్షుడిగా కొమ్మరాజు సత్యనారాయణను ఎన్నుకున్నారు. సభ్యులుగా నిమ్మల అప్పారావు, దామోదర్ రెడ్డి, పుల్లారెడ్డి, బిచ్చమయ్య, కాక రాఘవమ్మ తదితరులు ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, నాయకులు పాల్గొన్నారు

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించే విధంగా వేగవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గృహ నిర్మాణ శాఖాధికారి రవీంద్రనాథ్‌లతో కలిసి కలెక్టర్ ప్రజల వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా సమర్పించగా వాటిని శ్రద్ధగా విన్న కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఎండార్స్ చేసి తక్షణ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో స్వీకరించిన పలు దరఖాస్తులను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగత పర్యవేక్షణ చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని పెండింగ్ లేకుండా నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సమర్థవంతమైన పరిపాలన అందించడంలో అధికారులు కట్టుబడి ఉండాలని తెలిపారు.

**ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు..**

కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన ఉమామహేశ్వరి 54 శాతం దివ్యాంగ సమస్యతో పెన్షన్ పొందుతూ ఉండగా గత కొన్ని నెలలుగా పెన్షన్ నిలిచిపోయినట్లు తెలిపారు. వికలాంగుల సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసినప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పునరుద్ధరణ కాలేదని పేర్కొన్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందని తెలియజేస్తూ పునరుద్ధరణ చేయాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల కోసం డీఆర్డీఓకు ఎండార్స్ చేశారు.
టేకులపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన బానోతు తోలచంద్ తనకు కంపార్ట్‌మెంట్ నెం. 17లో 5.19 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నప్పటికీ ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా బుక్ ఇప్పటివరకు అందలేదని తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ తగు చర్యల నిమిత్తం జిల్లా అటవీ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. సుజాతనగర్‌కు చెందిన సునావత్ కుమార్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకొని నాలుగు నెలలు గడిచినా మంజూరు కాలేదని కుటుంబ పోషణ కష్టంగా మారిందని తెలిపారు. ఈ దరఖాస్తును పరిశీలించి తగు చర్యల కోసం జిల్లా పౌర సరఫరాల అధికారికి ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని పది గ్రామాల ఆదివాసీ ప్రజలు ప్రభుత్వ వైద్యశాల లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా రాత్రివేళ వృద్ధులు పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుపుతూ గ్రామంలో వైద్యశాల ఏర్పాటు చేయాలని కోరగా ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఇల్లందు మండలం అశోక్‌నగర్ గ్రామానికి చెందిన ఎల్లబోయిన రాణి పీజీ వరకు చదివి నిరుద్యోగిగా ఉన్నానని ఔట్‌సోర్సింగ్‌లో ఉపాధి కల్పించాలని కోరారు. ఈ దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్ జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.

**విద్యాసంస్థలపై పర్యవేక్షణ చేపట్టండి..**

ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాఠశాలలు, వసతి గృహాలలో మెనూ ప్రకారం ఆహారం అందించడం జరగడం లేదని గుర్తించినట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు, పాఠశాలలు మరియు వసతి గృహాల పర్యవేక్షణ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని విద్యాసంస్థలపై ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేపట్టాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. వారంలోపల జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉన్న లోపాలను గుర్తించి సరిచేయాలని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. అలాగే ప్రజావాణి కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారులు హాజరు కాకపోవడంపై గల కారణాలు ఆరా తీసి ఇకపై తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని స్పందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను

# సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజన పథకంపై అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి సూర్యఘర్ ముక్తి బిజిలీ యోజనను జిల్లాలో అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఇళ్ల పైభాగంలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని స్వయం విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగం పర్యావరణ పరిరక్షణకు దోహదపడటంతో పాటు కార్బన్ ఉద్గారాలను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అదనంగా వినియోగించని విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి తిరిగి ఆదాయం పొందే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒక కోటి కుటుంబాలకు ప్రతి నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం ఈ పథకం లక్ష్యమని వెల్లడించారు. సబ్సిడీ వివరాలను తెలియజేస్తూ 2 కిలోవాట్ వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.30,000, 3 కిలోవాట్ అంతకంటే ఎక్కువ సామర్థ్యంపై అదనంగా రూ.18,000 సబ్సిడీ అందించబడుతుందని తెలిపారు. పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, విద్యుత్ బిల్, బ్యాంక్ పాస్‌బుక్, ఫోటో అవసరమని తెలిపారు. అర్హులైన వినియోగదారులు అధికారిక వెబ్‌సైట్ pmsuryaghar.gov.in లో నమోదు చేసుకుని రాష్ట్రం, విద్యుత్ పంపిణీ సంస్థ, కస్టమర్ నంబర్ తదితర వివరాలను నమోదు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్సీ జి.మహేందర్, టీజీఆర్ఈడీసీఓ జిల్లా మేనేజర్ పి.అజయ్ కుమార్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**చర్ల మహా:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ వేడుకలు చర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయం నందు మండల అధ్యక్షులు నూప రమేష్ జెండా ఆవిష్కరణ చేశారు. బిజెపి శ్రేణులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తి కంటే పార్టీ ముఖ్య మని. పార్టీ కంటే దేశం ముఖ్య మనేది బిజెపి సిధాంతం అన్నారు. ఇద్దరితో మొదలైన ప్రయాణం నేడు కోట్ల మందికి చేరువైనది అని తెలిపారు. ఓటమికి కుంగని గెలుపుకు పొంగని నాయకత్వం బిజెపి విధానం అని అన్నారు. జాతీయవాదం తమ పార్టీ లక్ష్యం అని ఆయన తెలిపారు. స్వీట్లు. బిస్కెట్లు. పంచారు. అదేవిధంగా కలివేరు గ్రామంలో క్రాస్ రోడ్ నందు పార్టీ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యవర్గ సభ్యులు గునూరి రమణ. జిల్లా కౌన్సిల్ సభ్యులు బాబా ఫహీం. ఎంపీటీసీ ఇంచార్జి సరియం ధర్మరాజు కార్యదర్శులు శ్రీనివాస్ చారి. విశ్వనాథం. బంధా మధు వెంకటేష్. వినయ్. సమ్మయ్య. సందీప్. హరినాథ్. ఇర్ప సుబ్బారావు. లక్ష్మి పొడియం జోగారావు పి సుబ్బారావు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# చీమలవారిగూడెంలో సీసీ రోడ్ల పనులు ప్రారంభం



**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ చీమలవారిగూడెంలో సోమవారం సీసీ రోడ్ల పనులను సర్పంచ్ ఈసం మోతీ వీరస్వామి, సంత ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్యలు ప్రారంభిచారు. రేగులగూడెం గ్రామపంచాయతీ అభివృద్ధికి గాను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలు రూ. 20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో పనులు నిర్వహించటం జరుగుతుందన్నారు. పంచాయతీలోని శివారు గ్రామాలలోని వీధులను సీసీ రోడ్లుగా మార్చటం జరుగుతుందన్నారు. గేటుకారేపల్లి రైల్వే గేటు నుండి అనంతారం గ్రామం వరకు గల రహదారి కంకర తేలి గత కొన్ని ఎండ్లుగా 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దానిని బీటీగా మార్చటానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రూ.20 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు పెద్దబోయిన వెంకటనర్సయ్య, చీమల లక్ష్మి, చెవుల భద్రయ్య, ఆవుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అడవిలో మూగజీవాలకు అండగా అటవీ శాఖ..

**అడవిలో నీటి తొట్టెల ఏర్పాటు..**



**మణుగూరు, మహా :** ఎండ తీవ్రత రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో అడవిలోని మూగజీవాల రక్షణకు అటవీ శాఖ అండగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. మణుగూరు అటవీ శాఖ డివిజన్ పరిధిలోని మొండికుంట గ్రామపంచాయతీ అటవీ ప్రాంతంలో సోమవారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో నీటి తొట్టెలను నింపి జంతువులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. వేసవి కాలంలో నీటి కొరతతో జంతువులు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అటవీ శాఖ తీసుకున్న ఈ చొరవపై స్థానికులు సంతృప్తి వ్యక్తం చేస్తూ అటవీ సిబ్బందిని అభినందించారు.

# ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం..

**పరిశుభ్రత పాటించాలి..: డాక్టర్ సునీల్**



**మణుగూరు, మహా :** ప్రజా పాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా అమలవుతున్న 99 రోజుల ఆరోగ్య కార్యక్రమాలలో సోమవారం నిర్వహించిన ఫుడ్ సేఫ్టీ ఫోకస్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టళ్లలో పనిచేస్తున్న వంటకారులు, కాంటిజెంట్ వర్కర్లకు ఫుడ్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా హాస్టల్ వంటశాలలు, స్టోర్ రూమ్‌లను పరిశీలించిన ఆయన, ఆహార పదార్థాల నిల్వ, వంట విధానాల్లో శుభ్రత ప్రమాణాలు పాటించాలని తగు సూచనలు చేశారు. అనంతరం భగత్ సింగ్ నగర్, శేషగిరి నగర్, పైలెట్ కాలనీలలో జరుగుతున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్ కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు షుగర్, బీపీ వంటి అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పరంగిణీ, హెచ్ఎం మహాలక్ష్మి రాంప్రసాద్, కృష్ణ, అనిత, రమణ, సమ్మక్క, ఎంఎల్‌హెచ్‌పీలు వినయ్, మనీషా తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ కు దోచిపెట్టటానికే లేబర్ కోడ్ లు

**కారేపల్లిలో బీటీ రణదీవే, ఎర్ర శ్రీకాంత్ వర్ధంతులు**



**కారేపల్లి, మహా :** కార్మికుల కష్టాన్ని కార్పొరేట్ కు దోచిపెట్టటానికే మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ లను తెచ్చిందని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర అన్నారు. సోమవారం కారేపల్లిలోని హమాలీ అడ్డలో సీఐటీయు నేతలు బీటీ రణదీవే, ఎర్ర శ్రీకాంత్ ల వర్ధంతి ని నిర్వహించారు. అమరుల చిత్రపటాలను పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఐక్యత - పోరాటం నినాదంతో 1970లో ఏర్పడిన సీఐటీయూ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్మికోద్యమాన్ని దేశవ్యాప్తంగా విస్తరించడంలో బీటీఆర్ చేసిన సేవలు అమోఘమన్నారు. ఖమ్మం జిల్లాలో సీఐటీయు విస్తరణకు ఎర్ర శ్రీకాంత్ ఎంతో కృషి చేశారన్నారు. పని గంటల పెంపు, కనీస వేతనాల అమలు, సంఘం ఏర్పాటు హక్కు, సమ్మె హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు కార్మికులను బలి పశువులుగా మార్చే విధానాలకు వ్యతిరేకంగా బీటీ రణదీవె, ఎర్ర శ్రీకాంత్ చూపిన పోరాట బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆరేల్లి శ్రీరాములు, హమాలీ యూనియన్ గౌరవాధ్యక్షులు ముక్కా సీతారాములు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు కేలోతు రవి, రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, సీఐటీయు నాయకులు తురక సంపత్, తిరపయ్య, సైదులు, బాబు, కోటయ్య, నూకల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్ల ప్రారంభం

### భద్రాచలం ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం




**చర్ల మహా:** భద్రాచలం డివిజన్‌కు చెందిన ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్ చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని పలు ఆదివాసీ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాళ్లను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఆదివాసీ ప్రజలకు సామూహిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కమ్యూనిటీ హాళ్లు నిర్మించబడినట్లు అధికారులు తెలిపారు. ఈ హాళ్లు గ్రామాల్లో సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, సామాజిక వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగపడనున్నాయి. ఈ సందర్భంగా ఏఎస్పి మాట్లాడుతూ, గ్రామీణ అభివృద్ధి మరియు ఆదివాసీ సంక్షేమానికి ఇలాంటి సదుపాయాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజలు ఈ హాళ్లను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**సారపాకలో జెండా ఆవిష్కరణ**



**బూర్గంపహాడ్ మహా :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని సారపాక ప్రధాన కూడలిలో మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ రాష్ట్ర నాయకుడు ఏనుగు వెంకట్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, 1980 ఏప్రిల్ 6న స్థాపించబడిన భారతీయ జనతా పార్టీ నేడు దేశవ్యాప్తంగా విస్తరించి అనేక రాష్ట్రాల్లో పరిపాలనలో భాగస్వామ్యమైందని తెలిపారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పార్టీ ప్రభావం పెరిగిందని, కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో మంచి పరిపాలన కొనసాగుతోందని కొనియాడారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన నాయకుడిగా నరేంద్ర మోడీ నిలిచారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని, "డబుల్ ఇంజిన్ సర్కార్" లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చుక్కపల్లి బాలాజీ, కేసగాని శ్రీనివాస్ గౌడ్, గడ్డం సతీష్, దుప్పటి సురేష్, వెలిశెట్టి రామారావు, కేసు పక్క శ్రీనివాస్, జక్కం సత్యనారాయణ, యాదవుల గోవర్ధన్ తదితర నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేశారు

# అప్పాయిగూడెంకు హైమాస్ట్ లైట్లు మంజూరు

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెల్పిన సర్పంచ్ ప్రవీణ్**



**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం అప్పాయిగూడెం గ్రామపంచాయతీకి వైరా ఎమ్మెల్యే హైమాస్ట్ లైటు మంజూరు చేసినట్లు సర్పంచ్ దండు ప్రవీణ్ తెలిపారు. సోమవారం లైట్ ఏర్పాటుకు సంబంధించి పనులు చేపట్టారు. ఈసందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ మార్గదర్శకంలో అభివృద్ధి పనులు చేపట్టటం జరుగుతుందన్నారు. ఇప్పటికి గ్రామపంచాయతీలో అడ్డ పిల్ల పుట్టితే రూ.5వేలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధిని నిధుల వెసులుబాటు అనుసరించి ప్రాధాన్యత క్రమంలో చేయటం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎట్టి సంధ్యారాణి, వార్డ్ సభ్యులు వాంకుడోత్ రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్తీయ శివాజీ, పులసం భద్రం , కుంజ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల రిలే నిరాహార దీక్షకు సర్పంచ్ మద్దతు

### సారపాకలో కార్మికుల డిమాండ్లపై స్పందన





**బూర్గంపహాడ్ మహా :** మండలపరిధిలోని సారపాక గ్రామంలోని ఐటీసీ లిమిటెడ్ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సారపాక సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మద్దతు తెలిపారు. గత 12 రోజులుగా కర్మాగారం గేటు ముందు కాంట్రాక్ట్ కార్మికులు, జేఏసీ నాయకులు కలిసి రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. 13వ వేతన ఒప్పందానికి సంబంధించిన పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, అలాగే రాబోయే 14వ వేతన ఒప్పందాన్ని గుర్తింపు సంఘంతో కాకుండా జేఏసీ తోనే చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీక్షల్లో పాల్గొన్న సర్పంచ్ మాట్లాడుతూ, కాంట్రాక్ట్ కార్మికుల కృషి వల్లే కర్మాగారం అభివృద్ధి చెందిందని అన్నారు. వారి శ్రమనే సంస్థ అభివృద్ధికి మూలమని పేర్కొన్నారు. కార్మికులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవేనని, యాజమాన్యం వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇప్పటికే పలుమార్లు యాజమాన్యానికి నివేదికలు సమర్పించినప్పటికీ స్పందన లేకపోవడం సరైంది కాదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలో ఆందోళనలు చేపట్టే అవకాశం ఉందని కార్మిక నాయకులు హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం..

# ఎమ్మెల్యేను కలిసిన పాతూరు ప్రతినిధులు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సోమవారం అల్లపల్లి మండలం పాతూరు గ్రామపంచాయతీకి చెందిన ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం వినతి పత్రం సమర్పించారు. గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గొగ్గెల సుజాత, గొగ్గెల నందిని, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏనాడు ఆలోచన చేయలేదు

### రైతులను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు

### రాష్ట్ర రెవిన్యూ మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి



**నేలకొండపల్లి, మహా:** రైతుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ఏనాడు ఆలోచన చేయలేదని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్రెడ్డి పేర్కోన్నారు. మండలం లోని మోటాపురం లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...గత పాలకులు వ్యవసాయంను పట్టించుకోకుండా వదిలేశారని అన్నారు. వరి వేస్తే ఉరే అన్న సందర్భం నుంచి నేటి ప్రజా 'ప్రభుత్వం గిట్టుబాటు ధరలతో పాటు, బోనస్ ను అందించి వ్యవసాయం ను ప్రోత్సాహిస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా, వ్యవసాయం యాంత్రీకరణ పనిముట్లు సబ్సీడీ పై అందిస్తున్నట్లు తెలిపారు. రైతుల ను దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని నిర్వహాకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, సోసైటీ మాజీ చైర్మెన్ భాగం హేమంతరావు, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, తన్నీరు కృష్ణమూర్తి, భద్రయ్య, నంబూరి రామారావు, గుడిమళ్ల మధు, వెంకన్న, బొందయ్య, వెంకటేశ్వర్లు, మంకెన వెంకటేశ్వరరావు, కడియాల నరేష్, చిట్యాల రమేష్, పగిళ్ల పృధ్వీ, యర్రబోయిన నర్సయ్య, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, వివిధ పంచాయతీ సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# వైరా ఏసీపీ సారంగపానిని సన్మానించిన సరికొండ అప్పలరాజు..



**తల్లాడ, మహా:** వైరా పోలీస్ అడిషనల్ కమిషనర్ సారంగపాణిని తల్లాడ పట్టణానికి చెందిన మట్టమ్మ హోటల్ అధినేత సరికొండ అప్పలరాజు కలిశారు. శనివారం వైరాలోని ఏసీపీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన శాలువాలతో సన్మానించి సత్కరించారు. గతంలో తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన ఆయనతో కొద్దిసేపు బాగోగులను చర్చించుకున్నారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ ఏసిపిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్లు తెలిపారు.

# ఐదు పంచాయతీలపై తుమ్మల ప్రయత్నం అభినందనీయం

**సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు**



**భద్రాచలం మహా :** భద్రాచలానికి ఆనుకుని ఉన్న ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాయడం పార్లమెంట్లో పోరిక బలరామ నాయక్ వద్దిరాజు రవిచంద్ర పంచాయతీలపై ప్రస్తావించడం అభినందనీయమని తెలంగాణకు చెందిన మిగతా పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని పార్లమెంటులో ఐదు గ్రామపంచాయతీలపై ఆర్డినెన్స్ తీసుకువచ్చేలా కృషి చేయాలని సిపిఐఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం స్థానిక చంద్రరావు భవనంలో ఎర్రం శెట్టి వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సిపిఐఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమరావతికి చట్టబద్ధత తీసుకొస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని సవరించిన కేంద్ర ప్రభుత్వం ఐదు పంచాయతీలను భద్రాచలంలో కలిపే అంశం మాత్రం ప్రస్తావించకపోవడం దుర్మార్గమని అన్నారు. తెలంగాణలో ఎనిమిది మంది బిజెపి పార్లమెంటు సభ్యులు ఉన్న ఒక్కరు కూడా ఐదు గ్రామపంచాయతీ లపై నోరు మెదపకపోవడం బిజెపి భద్రాచలం పై చూపిస్తున్న వివక్షతకు ప్రత్యక్ష నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అమిత్ షాకి గతంలో సైతం పలుమార్లు ఐదు పంచాయతీలపై విన్నపించారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నుండి సరైన స్పందన రాని నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలని మచ్చ వెంకటేశ్వర్లు కోరారు. అదేవిధంగా పోలవరం నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వం చేతిలోనే ఉంది కాబట్టి బ్యాక్ వాటర్ తో ముంపు గురయ్యే భద్రాచల పట్టణాన్ని సైతం రక్షించే బాధ్యత కేంద్రానిదేనని అన్నారు. గతంలో నీటిపారుదల శాఖ నిపుణులు సూచించిన ప్రకారం కరకట పునర్మాణ పనులను వెంటనే చేపట్టాలని మచ్చ డిమాండ్ చేశారు. కరకట్ట పనులు పునర్మించకుండా ఆలయ అభివృద్ధి చేసిన ప్రయోజనం ఏమిటని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. భద్రాచల అభివృద్ధికి ఐదు పంచాయతీలు రక్షణకు కరకట పునర్ నిర్మాణ పనులు రెండు కూడా బాధ్యత తీసుకోవాల్సింది బిజెపి అని ఆ విధంగా బిజెపిపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఐదు గ్రామపంచాయతీ లపై సిపిఐఎం మొదటి నుండి దశల వారి ఉద్యమాలను నిర్వహిస్తుందని భవిష్యత్తులో కూడా కలిసి వచ్చే అన్ని పక్షాలను కలుపుకొని కలుపుకొని పోరాటాలను ఉదృతం చేస్తామని మచ్చ స్పష్టం చేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

- రోగులకు అందుతున్న వైద్య సేవల పై ఆరా
- వేసవి తీవ్రత ముందస్తు చర్యలపై సిబ్బందికి ఆదేశం



**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రి పరిసరాలను, విభాగాల పనితీరును, సమగ్రంగా పరిశీలించిన కలెక్టర్, వైద్య సేవల నాణ్యత పై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించిన కలెక్టర్, అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స, వైద్య సిబ్బంది స్పందన పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఔట్ పేషెంట్ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, అక్కడికి వచ్చిన రోగులతో ముచ్చటించారు. ఒక వృద్ధుడు తనకు ఎవరూ లేరని, ప్రమాదంలో కాలు కోల్పోయినట్లు తెలియజేస్తూ, సహాయం కోరగా వెంటనే సంబంధిత అధికారులకు ఆ వృద్ధుడి పూర్తి వివరాలు సేకరించి, కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించి అవసరమైన మెరుగైన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇన్ పేషెంట్ విభాగంలో వడదెబ్బ కేసులు నమోదవుతున్నట్లు గుర్తించిన ఆయన వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ను ఆదేశించారు. ఆసుపత్రిలో ఔషధ నిల్వ గదిని, స్టాక్ రిజిస్టర్ లో నమోదైన ఔషధాల వివరాలు, నిల్వల ను పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్న మందులు ఎంతో విలువైనవి అని, వాటిని పక్కదారి పట్టకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, బహిరంగ మార్కెట్లో విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రులు ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించే ముఖ్య కేంద్రాలని, ఇక్కడ అందించే సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఆసుపత్రి వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు సమయానుకూలంగా సేవలు అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, మెడికల్ అధికారి వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్స్, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చర్లపల్లి కారాగారంలో 'నివృత్తి' కేంద్రాన్ని ప్రారంభించిన గవర్నర్

### ఖైదీల పరివర్తనకు కారాగారాలు పునరావాస కేంద్రాలుగా మారాలి

**కుషాయిగూడ, మహా :** కారాగారాల్లో శిక్ష అనుభవిస్తున్న వారిని మత్తు వ్యసనాల నుంచి దూరం చేసి, వారిని బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఏర్పాటు చేసిన 'నివృత్తి' వ్యసన విముక్తి కేంద్రాన్ని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర కారాగారాల శాఖ సంచాలకులు డాక్టరు సౌమ్య మిశ్రా ఆయనకు సాదర స్వాగతం పలికారు.ఈ సందర్భంగా జరిగిన సభలో గవర్నర్ మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న మత్తు పదార్థాల దుర్వినియోగం అనేది కేవలం శాంతి భద్రతల సమస్య మాత్రమే కాదని, అది ఒక తీవ్రమైన ప్రజారోగ్య సమస్య అని పేర్కొన్నారు. దీనిని సమగ్రంగా, శాస్త్రీయ పద్ధతిలో ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గవర్నర్ తన ప్రసంగంలో గత స్మృతులను నెమరువేసుకున్నారు. "నా రాజకీయ ప్రస్థానంలో అనేకసార్లు జైలుకు వెళ్లిన అనుభవం ఉండటం వల్ల, ఖైదీలు ఎదుర్కొనే ఇబ్బందులు, సిబ్బంది పడే కష్టాలు నాకు తెలుసు. అందుకే గతంలో జైలు శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు ఖైదీలకు మానవీయ వాతావరణం కల్పించాలని నిర్ణయించాను.కారాగారాల్లో విద్యుత్






విసనకర్రలు (ఫ్యాన్లు), వార్తావిశేషాల కోసం దూరదర్శన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చాను. పోలీసు కానిస్టేబుళ్లతో సమానంగా జైలు వార్డర్లకు వేతనాలు అందేలా కృషి చేశాను" అని వివరించారు.

**వ్యసన రహిత భారతం దిశగా అడుగులు:**

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మత్తు రహిత భారత అభియాన్' లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ కారాగార శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని గవర్నర్ కొనియాడారు. చంచల్‌గూడ, చర్లపల్లి, సంగారెడ్డి, నిజామాబాద్‌తో పాటు మహిళా కారాగారాల్లోనూ ఈ 'నివృత్తి' కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా డాక్టరు సౌమ్య మిశ్రా నాయకత్వంలో జరుగుతున్న సంస్కరణలు కారాగారాల రూపురేఖలను మారుస్తున్నాయని ప్రశంసించారు.

**చికిత్స మరియు పునరావాసం:**

కారాగారాల శాఖ సంచాలకులు డాక్టరు సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. వ్యసన విముక్తి కేంద్రాల పనితీరును వివరించారు. ఈ కేంద్రాల్లో మానసిక విశ్లేషకులు, సామాజిక కార్యకర్తలతో కూడిన బృందాలు పనిచేస్తున్నాయి. కేవలం మందులతోనే కాకుండా, ఖైదీల మనస్తత్వంలో మార్పు తెచ్చేలా కౌన్సెలింగ్, విభిన్న చికిత్సా పద్ధతులను అనుసరిస్తున్నారు.శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత కూడా వారు తిరిగి వ్యసనాల బారిన పడకుండా సిబ్బంది ఫాలోఅప్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటివరకు 2,915 మంది ఖైదీలకు పరీక్షలు నిర్వహించగా, తీవ్రమైన వ్యసన స్థితిలో ఉన్న 590 మందిని గుర్తించి వారికి ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం గవర్నర్ చర్లపల్లిలోని ఖైదీల వ్యవసాయ క్షేత్రాన్ని (పీఏసీ) సందర్శించారు. అక్కడ ఖైదీలు సాగు చేస్తున్న సేంద్రియ పంటలు, తేనెటీగల పెంపకాన్ని తిలకించి వారితో ముచ్చటించారు. పబ్లిక్‌ప్రైవేట్ భాగస్వామ్యంతో నడుస్తున్న 'ఏరియా 77' సాహస క్రీడల ప్రాంగణాన్ని సందర్శించి, అక్కడ మాజీ ఖైదీలకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి జీవనోపాధి కార్యక్రమాలే వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగుల సంక్షేమ శాఖ సంచాలకులు బి. శైలజ, ఉప్పల్ ప్రాంత ఉప పోలీసు కమిషనర్ కె. సురేష్ కుమార్, కారాగారాల శాఖ ఐజీ మురళీబాబు, డీఐజీ డాక్టరు డి.శ్రీనివాస్, సూపరింటెండెంట్లు నవాబ్ శివకుమార్ గౌడ్, ప్రమోద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## శుభోదయం కాలనీలో అక్రమాన్ని నిర్మాణాలపై చర్యలేవి?




**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో అక్రమ నిర్మాణాల దారులు ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనాలను నిర్మించనున్నారు మున్సిపల్ అధికారులు అవినీతి అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది మున్సిపల్ అధికారులే అక్రమ నిర్మాణాల దారులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు శుభోదయం 199 సర్వేనెంబర్ అయినప్పటికీ ప్రభుత్వ స్థలాలలో మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు దీంతో మున్సిపాలిటీ కి వచ్చే ఆదాయానికి గండి పడుతుంది అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేస్తే ఆ ఫలానా వ్యక్తి ఫిర్యాదు చేశాడని లీకలు ఇస్తున్నారు శుభోదయం కాలనీలో అక్రమంగా వెలుతున్న బహుళ అంతస్థ భవనంపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు విన్నవిస్తున్నారు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సిందే

## ఏఎస్ రావు నగర్ డివిజన్ లో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కుషాయిగూడ, మహా :** భారతీయ జనతా పార్టీ 47 వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు డాక్టర్ ఎస్ రావు నగర్ డివిజన్ లో భాగంగా శ్రీనగర్ కాలనీ ముఖ ద్వారం వద్ద జరిగిన కార్యక్రమం సిద్దూరి సంపత్ రావు డివిజన్ ప్రధాన కార్యదర్శి, జీవిఎన్ రావు జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు ఏనుగు రాజిరెడ్డి జిల్లా భారతీయ కిసాన్ మోర్చా అధ్యక్షుడి అధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీశైలం, లక్ష్మయ్య, రామానుజాచార్యులు, కుమార స్వామి, హెమంత్ కుమార్, ఆనంద్ రాజ్, బిక్షపతి కందకట్ల, నాగమల్లీశ్వర్ రెడ్డి, బాలకృష్ణ, సంతోష్, సాయి కిరణ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరాందు సూర్యదేవర, అశోక్ వి, కౌశిక్ నాయుడు, వెంకట రమణారెడ్డి, గణేష్ రాథోడ్, ప్రసాద్ జి వి వి, బాబు రావు, రమేశ్ జీ వి, జయరాజ్, అనిల్ ఎన్, రవీందర్ నామ్, ఆంజనేయ ప్రసాద్, నరేంద్ర కుమార రాజు, రాజిరెడ్డి కాకర, మల్లారెడ్డి మోర, రెడ్డి శ్రీనివాస్ రావు, శ్రీకాంత్, నరేష్ రాథోడ్, లక్ష్మీ పతి, పరమేశ్ యాదవ్, దబ్బాక శ్రీనివాస్ మరియు ఇతరులు పాల్గొన్నారు కుషాయిగూడలో బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మణ్ గౌడ్, హరినాయక్ కే విద్యాసాగర్ బండారి అనిల్ చల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

### పార్టీ జెండాను ఆవిష్కరించిన భూక్య రమేష్



**జూలూరుపాడు, మహా:** భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండల పరిధి కాకర్ల గ్రామంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య రమేష్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను బిజెపి మండల అధ్యక్షుడు రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ స్థాపన ప్రాముఖ్యతను పార్టీ శ్రేణులకు వివరించారు. దేశ అభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ కీలక పాత్ర పోషిస్తున్నదని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని తెలిపారు. ప్రతి కార్యకర్త ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ధరవత్ బాలకిషన్, యువ మోర్చా నాయకుడు గుగులోత్ రాంబాబు, కార్యదర్శి గుగులోత్ బాబులాల్, గిరిజన మోర్చా అధ్యక్షుడు భూక్య రవి, పూసులూరి మనోహర్, కర్నాటి వీరభద్ర రావు, కిష్టంశెట్టి గోపాల రావు, పాతర్లపాటి నవీన్, కళ్యాణపు వెంకటప్పయ్య, రొడ్డ సతీష్, బాణోత్ పృధ్వి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సామాజిక వర్గం రాజకీయంగా రాణించాలి

### ముదిరాజ్ సంఘ భవన నిర్మాణానికి వితరణ



**కుషాయిగూడ, మహా :** ముదిరాజ్ సామాజిక వర్గం రాజకీయంగా రాణించాలని సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అనిల్ కుమార్ ముదిరాజ్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మాయిగూడ కు చెందిన అరికెల అనిల్ కుమార్ ముదిరాజ్ సోమవారం రూ. 1,00,116( లక్ష నూట పదహారు రూపాయలు) వితరణ చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ యాదగిరిగుట్టలో నిర్మాణం చేస్తున్న ముదిరాజ్ సంఘం భవనానికి కలిసికట్టుగా ముందుకు సాగాలని అన్నారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులకు చెక్కును అందజేశారు. లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులు అనిల్ కుమార్ కు ఎల్లప్పుడూ ఉండాలని సొసైటీ సభ్యులు ఆకాంక్షించారు.

## ఫోక్సో కేసు నిందితుడికి జీవిత ఖైదు



**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ పీఎస్ పరిధిలోని సాయి నగర్ లో 2010లో జరిగిన మైనర్ అమ్మాయి రేప్ అండ్ మర్డర్ కేసు నందు నిందితుడు కాకర్ల అనిల్ కుమార్ పై 2012 నుండి నాన్ బేలబుల్ వారెంట్ పెండింగ్ ఉండగా కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి సార్ యొక్క చొరవతో నిందితున్ని 2025 నవంబర్లో విజయవాడలో పట్టుకొని జైలుకు తరలించడం జరిగింది. కేసు ఫాస్ట్ ట్రాక్ ఫోక్సో నేరేడ్మెట్ కోర్టు నందు విచారణ జరుగగా విచారణ అనంతరం జడ్జి ఆశాలత ముద్దాయికి జీవిత ఖైదు మరియు 1000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో విచారణ అధికారి ముత్యం రెడ్డి మంచి ఎఫర్ట్స్ చేసిన ఎస్సై సుధాకర్ రెడ్డి సతీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస చారి కోర్టు కానిస్టేబుల్ జి శ్రీనివాస్, ఏఎస్ఐ భూములు, హెచ్ సి సత్యం, రామచందర్, అంజయ్య, రమేష్ లను అధికారులు అభినందించారు.

## వార్డు సభ్యులకు శిక్షణ



**జూలూరుపాడు, మహా:** ఇటీవల నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ వార్డు సభ్యులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు. వారికి గ్రామపంచాయతీల అభివృద్ధి, పంచాయతీరాజ్ చట్టంలోని బాధ్యతలు, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి, మండల పంచాయతీల అధికారి తులసి రామ్ తదితరులు పాల్గొన్నారు.

## 47వ బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

### ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి అవతరించింది.. నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల



**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని వివిధ బస్తీలో, కాలనీలలో, కాటేదాన్ బిజెపి పార్టీ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య నాయకులు కార్యకర్తలతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా తోకల మాట్లాడుతూ శ్యామాప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై నిర్మితమైదీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతావాదానికి కట్టుబడి,పంక్తిలో చివరి వ్యక్తికి తొలి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ ఆచరిస్తూ...అటల్, అద్వానీ, అగ్రనేతల మార్గదర్శనంలోఅమిత్ షా , జేపీనాడ్డా నాయకత్వంలో ప్రపంచంలో అతిపెద్ద పార్టీగా అవతరించి...నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రపంచంలో భరతమాతను విశ్వ గురువుగా నిలిపే యజ్ఞంలో భాగమైనభారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు అభిమానులకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి నాయకులు మల్లా రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్, విజయ్ కుమార్, జోగి రవి ,రావుల భాస్కర్, బొమ్మరాజు నరసింహ, డివిజన్ అధ్యక్షులు పాండు యాదవ్, మైలేర్దేవ్పల్లి డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి, మాజీ అధ్యక్షులు అడికే జనార్దన్, పార్టీ సీనియర్ నాయకులు అడికే మహేందర్, సంతోష్ గౌడ్ , బల్ల శ్రీనివాస్,శంకర్ రెడ్డి,వల్లూరి శ్రీనివాస్,గూడూరి, రావుల భాస్కర్, తలారి చిన్న, బబ్లూ, శ్రీకాంత్ రెడ్డి,రాజ్ కుమార్, ఉడుత లక్ష్మీ, జయంతి, భారతి, అంజమ్మ, శ్రవణ్ కుమార్, ఎన్ను శంకర్ రెడ్డి, మజార్ భాయ్, షకీల్, రాజేష్, అంజి, శ్రీకాంత్ రెడ్డి,రామారావు, చంద్రశేఖర్,పుస్తకాల నందు, శ్రీనివాస్, అంజి, రామకృష్ణ, నర్సింహ గుప్తా,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### పార్టీ జెండాను ఆవిష్కరించిన బిజెపి నాయకులు...



**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామంలో బిజెపి నాయకులు 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మాజీ సర్పంచ్ చిటికల వెంకటయ్య బిజెపి నాయకులతో కలిసి సోమవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. వెంకటయ్య మాట్లాడుతూ అటల్ బిహారీ వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ లచే 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ స్థాపించబడింది.మొదటి భాజపా ప్రభుత్వం 1998లో లోక్‌సభ ఎన్నికలను మళ్ళీ నిర్వహించగా భారతీయ జనతా పార్టీకి మళ్ళీ అత్యధిక స్థానాలు లభించాయి. కోట్లాది మంది కార్యకర్తల నిస్వార్థ త్యాగం, అంకితభావం వల్లే బిజెపి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ శక్తిగా ఎదిగిందన్నారు.అందుకు కృషిచేసిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఇది కేవలం సంబరాలు చేసుకునే రోజు మాత్రమే కాదని, దేశమే ప్రథమం అనే సిద్ధాంతం పట్ల నిబద్ధతను చాటుకునే గర్వకారణమైన రోజని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యువ నాయకుడికి టికెట్ దక్కేనా...?

- పదేళ్ల కష్టానికి, పార్టీకి చేసిన కృషికి ఫలితం చేజిక్కుతుందా...?
- అన్నా అంటే ఆపదవైపు చూసే "చిన్నాగా" గుర్తింపు
- జడ్పీటీసీ రేసులో బుడిబుడి అడుగులు వేస్తున్న బీసీ బిడ్డ ...!!
- స్థానిక ఎన్నికల్లో బీసీ కోటాలో టికెట్ బీజం పడనుందా....?




**భద్రాచలం మహా :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక ఎంపీటీసి, జడ్పీటీసీ ఎన్నికలు త్వరలో జరగనున్న తరుణంలో భద్రాచలం జడ్పీటీసీ స్థానంపై యువ నాయకులకు సంబంధించి కొత్తపేర్లు తెరమీదకు రావడంతో స్థానిక యువతలో జోష్ నింపుతుంది. వివరాల్లోకి వెళ్తే... భద్రాచలం జడ్పీటీసీ రిజర్వేషన్ గతంలో STమహిళా రిజర్వేషన్ అవడంతో గిరిజన బిడ్డకు అవకాశం వచ్చింది. అయితే తెలంగాణా ప్రభుత్వం బీసీలకు మారుతున్న రాజకీయ, స్థానిక రిజర్వేషన్ల ప్రక్రియతో ST రిజర్వ్'గా ఉన్న ఈ స్థానం 'బీసీ'లకు 42% కేటాయించే క్రమంలో బీసీ రిజర్వడ్ గా మారే సూచనలు ఉన్నాయంటూ పలువురు రాజకీయ నిపుణులు అభిప్రాయపడటంతో, ఇక్కడి బీసీ నాయకులు కన్ను స్థానిక జడ్పీటీసీ పీఠంపై పడినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.అయితే ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గత 15_ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం జిల్లా స్థాయిలో శ్రమిస్తూ, పార్టీ ఆదేశాలు, పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఇటు నియోజకవర్గ స్థాయిలో అటు జిల్లా స్థాయిలో పార్టీ ఇచ్చిన ప్రతీ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తిస్తూ, యువత ప్రేరణతో తన మార్క్ రాజకీయాన్ని ప్రదర్శిస్తూ యూత్ కాంగ్రెస్ భద్రాద్రి జిల్లా నాయకుడిగా, ఓవైపు భద్రాచలం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొనసాగడం తన బలమైతే...మరో వైపు బీసీ బిడ్డగా, బీసీ కార్డు తనకు కలిసోచ్చే అంశమని భావిస్తున్నా బీసీ బిడ్డ ఎడారి ప్రదీప్ కుమార్ సైతం కలిసోస్తే జడ్పీటీసీగా నిలబడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసుకుంటున్నట్టు వార్తలు బయటకు వినిపిస్తున్నాయి. అయితే ప్రదీప్ కి తన పనితీరుతో పార్టీ అధిష్టానం నుండి క్లియరెన్స్ ఉండటం, రాష్ట్ర యువజన విభాగం నుండి తోడ్పాటు కలగడం, అలాగే మరో పక్క స్థానిక కాంగ్రెస్ పెద్దలు పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ ఆశీస్సులు, తెల్లం వెంకట్రావు సహకారం అలాగే పొదేం వీరయ్య గారి చేయూత కలిసోచ్చే అంశంగా భావించొచ్చు. అయితే ఈ స్థానంపై పార్టీకి చెందిన బడా నాయకుల కన్నులు సైతం వీక్షిస్తున్నాయని, కానీ ఎవరు నిలవాలన్నా స్థానిక రిజర్వేషన్లే ప్రధాన అజెండాగా నిలవానున్నాయి. మరి ఈ కుర్చీ యొక్క రిజర్వేషన్ స్థానం మారుతుందా లేక పాత పద్ధతిలోనే మరోసారి పురుడుపోసుకుంటుందా అనేది ఇప్పుడు చర్చంశంగా మారింది అయితే, ఎట్టి పరిస్థితిల్లో బీసీ రిజర్వేషన్ వస్తుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్న బీసీ బిడ్డ ఆశలు నేరువేరుతాయా లేదా అనేది త్వరలో జరిగే రిజర్వేషన్ల ప్రక్రియ అంశంపై ఆధారపడి ఉంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు

## ఎట్టకేలకు పారిశుద్ధ కార్మికుల జీతాలు పెంపు

### శంషాబాద్ జిహెచ్ఎంసి కార్యాలయంలో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో ఆమోదముద్ర

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో, గత మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తూ ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలో కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల వేతనాల పెంపుదలకు సోమవారం శంషాబాద్ జోన్ జిహెచ్ఎంసి కార్యాలయంలో స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలోఆమోదముద్ర లభించినది .ఈ పెంపుదలతో ఇప్పటివరకు పాత మున్సిపాలిటీ వేతనాల ప్రకారం వేతనాలు పొందుతున్న పారిశుధ్య కార్మికులకు ఇకముందు జీహెచ్ఎంసీ వేతనాల ప్రకారం జీతాలు చెల్లించబడతాయి.ఈ వేతన పెంపు నిర్ణయం పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు ఎంతో మేలు చేస్తుంది. నగర పరిశుభ్రత, ప్రజా ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.శంషాబాద్ జోన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేస్తూ, వారి సేవలు ఇదే విధంగా ప్రజలకు అందించాలని కోరడమైనది. జీహెచ్ఎంసీ పారిశుధ్య విభాగం బలోపేతానికి, కార్మికుల సంక్షేమానికి సంస్థ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని శంషాబాద్ జోన్ స్టాండింగ్ కౌన్సిల్ తెలిపింది.

## యువత క్రీడల్లో రాణించాలి..




- క్రీడాకారుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇలాంటి క్రీడల పోటీలు ఎంతో ఉపయోగపడతాయి
- మాజీ మంత్రి పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి

**మొయినాబాద్ మహా:** యువత క్రీడల్లో రాణించాలని.. క్రీడాకారుల్లో పోటీ తత్వాన్ని పెంచేందుకు ఇలాంటి క్రీడల పోటీలు ఎంతో దోహదపడతాయని మాజీ మంత్రి సబితా రెడ్డి తెలిపారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు మోర శ్రీనివాస్ తన తండ్రి కీర్తిశేషులు మోర శంకరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీలు సోమవారం సాయంత్రం ముగిశాయి. రెడ్డిపల్లి, కుత్బుద్దీన్ గుడ జట్లు ఫైనల్లో కలపడగా రెడ్డిపల్లి జట్టు గెలుపొందింది. విజేతలకు బహుమతులు అందజేసే కార్యక్రమంలో సబితా ఇంద్ర రెడ్డి పాల్గొని బహుమతులు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో గతంలో క్రీడా మైదానానికి స్థలం కేటాయించడం జరిగిందని దాన్ని మరమ్మత్తుల కోసం నిధులు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా అత్యాధునికమైన క్రీడా మైదానాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

## వినాయకుని విగ్రహ ప్రతిష్టాపనలో వివిధ పార్టీ నాయకులు..



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ జోన్ పరిధిలోని రాళ్ల గూడ ప్రకాష్ నగర్ లో సోమవారం మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వేద పండితుల సమక్షంలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.ప్రతిష్టాపన కార్యక్రమానికి,బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు కోలాన్ ప్రదీప్ రెడ్డి,మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ చైర్మన్ దూడల వెంకటేష్ గౌడ్, వైస్ చైర్మన్ బండి గోపాల్ యాదవ్ లు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ స్వామి వారి ఆశీర్వచనాలు ప్రజలందరి పై ఉండాలన్నారు.విఘ్నాలు తొలగించు విఘ్నేశ్వరుని సోమవారం ప్రతిష్ఠించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. కార్యక్రమంలో పలు పార్టీ నాయకులుమంచర్ల శ్రీనివాస్,కోన్నమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, చిక్కల ఎల్లయ్య, శంకర్ రెడ్డి, చక్రధర్ రెడ్డి, హనుమంతు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కృష్ణ, కిరణ్ సురేష్ ముదిరాజ్ , పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ మేట్లకు శిక్షణ




**జూలూరుపాడు, మహా:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మేట్లకు శిక్షణ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చెయ్యడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో కూలీలను చైతన్యపరిచి పనులకు తీసుకురావడం, ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా కూలీల యొక్క హాజరును ఏ విధంగా నమోదు చేయాలి, పనుల దగ్గర కొలతలు ఏ విధంగా తీసుకోవాలి, మస్టర్లు ఏ విధంగా వేయాలి, ఫీల్డ్ అసిస్టెంట్ కు ఏ విధంగా సహాయ కారిగా ఉండాలి అనే అంశాలపై మేట్లకు శిక్షణ ఇవ్వడం జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనిచేస్తున్న ప్రతి 50 మంది కూలీలకు ఒక మేటును ఎంపిక చేసి, శిక్షణ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఏపీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రియురాలిని పెళ్లాడిన కన్నడ హీరో..

కన్నడ హీరో సుముఖ బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పేశాడు. ప్రియురాలు మైత్రీ ఉకతో ఏడడుగులు వేసి వైవాహిక బంధంలోకి అడుగుపెట్టాడు. దాదాపు ఏడేళ్లుగా ప్రేమలో మునిగి తేలుతున్న ఈ లవ్‌బర్డ్స్ రిషికేశ్‌లో గంగానదీ తీరంలో పెళ్లి చేసుకున్నారు. ఇరుకుటుంబాలు సహా అతి దగ్గరి బంధువుల సమక్షంలోనే ఈ వివాహం జరిగినట్లు తెలుస్తోంది. వీరి పెళ్లి ఫోటోలు చూసిన అభిమానులు కొత్త జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కాగా సుముఖ.. కన్నడ ఇండస్ట్రీలో నటుడిగా రాణిస్తున్నాడు. యానా మూవీలో ముఖ్య పాత్ర పోషించిన ఇతడు ఫిజిక్స్ టీచర్, మానాడ కథలు చిత్రాల్లో కథానాయకుడిగా యాక్ట్ చేశాడు. ప్రస్తుతం రాజస్థాన్ డైరీస్ సహా మరో సినిమా చేస్తున్నాడు. ఇకపోతే ఫిజిక్స్ టీచర్‌లో మూవీలో నటించడంతో పాటు ఈ చిత్రంతో దర్శకుడిగానూ మారాడు. సుముఖ తల్లి నందిత యాదవ్ కూడా దర్శకురాలే కావడం విశేషం. సుముఖ భార్య మైత్రీ ఇంటీరియర్ డిజైనర్‌గా రాణిస్తోంది.



# సినిమాలకు పూర్తిగా గుడ్ బై..

## నటుడి కామెంట్స్ వైరల్..!

ఇటీవల స్టార్ హీరోయిన్ త్రిష పేరు ఎక్కువగా వినిపిస్తోంది. విజయ్ భార్య విడాకుల పిటిషన్ దాఖలు చేయడంతో అనూహ్యంగా త్రిష పేరు తెరమీదకొచ్చింది. విజయ్‌తో ఆమెకు రిలేషన్ ఉందని రూమర్స్ వినిపించాయి. ఆ తర్వాత వీరిద్దరు ఓ పెళ్లికి హాజరు కావడంతో వాటి మరింత బలం చేకూరింది. ఆ తర్వాత కోలీవుడ్‌లో ఈ టాపిక్ మరింత చర్చనీయాంశంగా మారింది. ఈ సంగతి పక్కన పెడితే తాజాగా కోలీవుడ్ సీనియర్ నటుడు, దర్శకుడు చిత్రా లక్ష్మణన్ చేసిన కామెంట్స్ హాట్ టాపిక్‌గా మారాయి. త్రిష త్వరలోనే సినిమాలకు పూర్తిగా గుడ్ బై చెప్పనున్నారని మాట్లాడారు. యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రస్తుతం చిత్రా లక్ష్మణన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. అయితే దీనిపై ఇప్పటి వరకు త్రిష టీమ్ నుంచి ఎలాంటి స్పందనైతే రాలేదు. ఇదే నిజమైతే వెండితెరపై త్రిషను చూడాలనుకున్న ఫ్యాన్స్‌కు నిరాశ తప్పేలా లేదు. చిత్ర లక్ష్మణన్ చేసిన కామెంట్స్ నిజమో కాదో తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే.

# డెకాయిట్‌లో అందాల చిచ్చుబుడ్డి

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ హీరో హీరోయిన్లుగా నటించిన ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం 'డెకాయిట్'.. తాజాగా ఈ మూవీ ట్రైలర్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలీవుడ్ నటి జైన్ మేరీ ఖాన్(31) ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆమె గురించి నెట్టింట ఆరా తీస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సోనీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని షానిల్ డియోల్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్, కామాక్షి భాస్కర్ల, అనురాగ్ కశ్యప్ నటిస్తున్నారు. ఈ నెల 10న ఈ చిత్రం విడుదల కానుంది.

బాలీవుడ్ దర్శక–నిర్మాత మన్సూర్ ఖాన్ కుమార్తె, నటుడు–దర్శక–నిర్మాత ఆమిర్ ఖాన్ మేనకోడలు జైన్ మేరీ ఖాన్. డెకాయిట్ చిత్రంతో ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. ఈ చిత్రంలో ఆమె పోలీస్ అధికారిగా కనిపించనున్నారు. ఒక్క ఈవెంట్‌తోనే తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ బ్యూటీ ఇప్పటికే బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించారు. కపూర్ అండ్ సన్స్ (2016), సీక్రెట్ సూపర్ స్టార్ (2017) వంటి చిత్రాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా జైన్ పని చేశారు. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన మిసెస్ సీరియల్ కిల్లర్ సినిమాతో జైన్ మేరీ ఖాన్ ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మోనికా ఓ మై డార్లింగ్(2022) మూవీలో ఛాన్స్ దక్కించుకుని మెప్పించారు. ఆకాష్ మొహిమెన్‌ను ప్రేమించి 2021లో ఆమె పెళ్లి చేసుకుంది.





# పెద్దిలో ఐటం సాంగ్.. తెలివిగా తప్పించుకున్న మృణాల్

సీతారామం చిత్రంతో సెన్సేషన్ అయింది మృణాల్ ఠాకూర్. హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ మూవీస్‌తో తెలుగు ప్రేక్షకులను మెప్పించింది. తాజాగా తను ప్రధాన పాత్రలో నటించిన మూవీ డెకాయిట్. ఇందులో సరస్వతిగా యాక్ట్ చేసింది. మరోవైపు రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న పెద్దిలోనూ ఐటం సాంగ్ చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

## పెద్దిలో ఐటం సాంగ్?

తాజాగా డెకాయిట్ ప్రమోషన్స్‌లో పాల్గొన్న మృణాల్‌కు పెద్దిలో ఐటం సాంగ్ గురించి ప్రశ్న ఎదురైంది. కానీ మృణాల్ సమాధానం చెప్పకుండా చాలా తెలివిగా తప్పించుకుంది. ఆమె మాట్లాడుతూ.. డెకాయిట్ కోసం ఏమైనా అడుగుతారని చూస్తున్నాను. సరే కానీ మీకో ఆసక్తికర విషయం చెప్పాలి. నా మాతృభాష మరాఠి. మరాఠి సినిమా కోసం పుణెలో షూటింగ్ చేస్తున్నాను.

## అదే సంతోషం

అక్కడున్న జనం మరాఠి చాలా చక్కగా మాట్లాడుతున్నానని ఆశ్చర్యపోయారు. నేను మరాఠీ అమ్మాయినే అని చెప్పినా సరే, కాదు.. తెలుగమ్మాయినే అనుకుంటున్నారు. ఒకరకంగా అది నాకు సంతోషంగానే ఉంది. సీతారామం, హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ సినిమాలు చాలామంది హిందీ ప్రేక్షకులు ఎటువంటి సబ్‌టైటిల్స్ లేకుండా తెలుగులోనే చూశారు. ఒక మహిళ అయితే ఎయిర్‌పోర్టులో నన్ను చూడగానే పరిగెత్తుకుంటూ వచ్చి హత్తుకుంది.

## అదే నాకు దక్కిన గౌరవం

తెలుగు సినిమాల్ని హిందీలో రిలీజ్ చేసినందుకు థాంక్యూ అని తెగ సంతోషపడిపోయింది. ఆమె ఆనందం చూస్తుంటే ముచ్చటేసింది. అదే నాకు దక్కిన గౌరవంగా భావించాను అంటూ అసలు సమాధానానికి బదులుగా ఏదేదో చెప్పింది. కానీ పెద్ది గురించి మాత్రం పెదవి విప్పలేదు. ఇకపోతే సీతారామం, హాయ్ నాన్నలు తనకు ఒక బెంచ్‌మార్క్ సెట్ చేశాయని, దానివల్ల పలు భారీ బడ్జెట్ సినిమాలను తిరస్కరించక తప్పలేదని మృణాల్ తెలిపింది.



# తెలుగులో ఈ ముద్దుగుమ్మకు తిరిగి ఛాన్స్‌లు వస్తాయా.!

సూపర్ స్టార్ మహేష్ బాబు నటించిన భరత్ అనే నేను సినిమాతో టాలీవుడ్ కు పరిచయం అయ్యింది.. బాలీవుడ్ ముద్దుగుమ్మ కియారా అద్వానీ. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనస్సులో స్థానం సంపాదించుకుంది ఈ అందాల భామ. ఈ సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఆతర్వాత రామ్ చరణ్ నటించిన వినయ విధేయ రామ సినిమాలో హీరోయిన్ గా నటించింది. తర్వాత తిరిగి బాలీవుడ్ కు చెక్కేసింది ఈ చిన్నది. చాలా కాలం తర్వాత తిరిగి రామ్ చరణ్ సినిమాతోనే టాలీవుడ్ కు రీ ఎంట్రీ ఇచ్చింది. శంకర్ దర్శకత్వంలో వచ్చిన గేమ్ ఛేంజర్ సినిమాలో నటించింది.ఈ సినిమా కూడా భారీ అంచనాల మధ్య విడుదలై డబుల్ డిజాస్టర్ అయ్యింది. ఇక ఇప్పుడు మరో పాన్ ఇండియా సినిమాతో రాబోతుంది. బాలీవుడ్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా ను ప్రేమించి పెళ్లి చేసుకుంది ఈ అమ్మడు. ఇటీవలే తల్లిగానూ ప్రమోషన్ అందుకుంది కియారా.బిడ్డ పుట్టిన తర్వాత ఇప్పుడు మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానుంది కియారా అద్వానీ. యష్ హీరోగా నటిస్తున్న సినిమాలో కియారా హీరోయిన్ గా నటిస్తుంది.



# నా రేటు ఇంత అని ఫిక్స్ చేశారు..

క్యాస్టింగ్ కౌచ్.. సినిమా ఇండస్ట్రీలో తరచూ వినిపించే పదం. స్టార్ హీరోయిన్లు మొదలు కొని చిన్న ఆర్టిస్టుల వరకు ఎంతో మంది ఆడవాళ్లు క్యాస్టింగ్ కౌచ్ బారిన పడుతున్నారు. అయితే వీరిలో చాలా మంది తమకు జరిగిన అన్యాయంపై సైలెంటుగా ఉన్నారు. కొద్ది మంది మాత్రమే ధైర్యంగా తమకు జరిగిన అవమానాలు, చేదు అనుభవాలను బయటపెడుతున్నారు. తాజాగా ఢీ డ్యాన్సర్, బిగ్ బాస్ మాజీ కంటెస్టెంట్ నైనికా అనసూరు తన క్యాస్టింగ్ కౌచ్ అనుభవాన్ని బయట పెట్టింది. ప్రస్తుతం టీవీ షోలతో బిజీ బిజీగా ఉంటోన్న ఆమె తాజాగా ఓ టాక్ షోకు హాజరైంది. తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలు పంచుకుంది. అలాగే క్యాస్టింగ్ కౌచ్ కు సంబంధించిన తనకు ఎదురైన చేదు అనుభవాలను బయట పెట్టింది. 'చాలా మంది అమ్మాయిల్లాగే నేను కూడా ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ బారినపడ్డాను. ఒకసారి నాకు బాగా పరిచయమైన వ్యక్తి ఫోన్ చేసి, నా ఫొటోలు అసభ్యకరంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయని, వాటికి రేట్లు కూడా ఫిక్స్ చేస్తున్నారని చెప్పాడు. అది విన్న వెంటనే నేను షాక్ అయ్యాను. నా ప్రమేయం లేకుండా ఇలాంటి ఘటనలు ఎలా జరుగుతాయో అర్థం కాక షాక్ లో ఉండిపోయాను. నా ఫ్రెండ్ మాటలు విన్నాక నాకు తీవ్రంగా కోపం, అసహ్యం కలిగింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో సినిమా ఇండస్ట్రీ చాలా వల్గర్‌గా మారిపోయింది. నేరుగా కమిట్మెంట్‌స్‌ని అడుగుతున్నారు. ఒకసారి బ్రాండ్ ప్రమోషన్ పేరుతో ఒక వ్యక్తి నన్ను సంప్రదించాడు. మొదట అతను చెప్పిన 'పర్సనల్ రిక్వైర్మెంట్' అంటే ఏమిటో అర్థం కాలేదు. కానీ పదేపదే అదే విషయాన్ని చెప్పడంతో అసలు విషయం అర్థమైంది. నాకు తెలిసి కొంత మంది అమ్మాయిల వల్లే ఇండస్ట్రీలో ఈ పరిస్థితి దాపరించింది. కమిట్మెంట్ కి రెడీ అయితే ఆఫర్స్ వస్తాయనే కొంతమంది అలాగే చేస్తున్నారు. ఒక వేళ నేను నటిని అయితే.. నా కూతురిని మాత్రం ఇండస్ట్రీకి రానివ్వను.



# కోర్ట్ రీమేక్.. హీరోయిన్‌గా దేవయాని కూతురు..!

తెలుగులో సూపర్ హిట్‌గా నిలిచిన మూవీ కోర్ట్. రోషన్, శ్రీదేవి జంటగా నటించిన ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ చిత్రంలో ప్రియదర్శి పులికొండ కీలక పాత్రలో మెప్పించారు. ఇక్కడ సూపర్ హిట్ అయిన మూవీని కోలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నారు. త్యాగరాజన్ డైరెక్షన్‌లో రంజన్ పేరుతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీతో సీనియర్ హీరోయిన్, నటి దేవయాని వారసురాలు ఎంట్రీ ఇస్తోంది. దేవయాని కుమార్తె ప్రియాంక ఈ సినిమాతో కోలీవుడ్‌లో అరంగేట్రం చేస్తోంది. ఈ సందర్భంగా మూవీ లాంఛ్‌కు హాజరైన దేవయాన్ని ఈ విషయాన్ని ప్రకటించింది. తన కూతురికి అవకాశమిచ్చిన త్యాగరాజన్‌కు ధన్యవాదాలు తెలిపింది. తన కూతురు సినీ ఇండస్ట్రీలో రాణిస్తుందని దేవయాని ధీమా వ్యక్తం చేసింది. కాగా.. నటి దేవయాని గురించి పరిచయం అవసరం లేదు. తమిళంలోనే కాకుండా తెలుగు తదితర భాషల్లోనూ హీరోయిన్‌గా నటించారు. ఆ తర్వాత దర్శకుడు రాజకుమార్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు పేరు ఇనియ, చిన్న కూతురు పేరు ప్రియాంక. ప్రస్తుతం తన చిన్న కుమార్తెను ఇండస్ట్రీకి పరిచయం చేస్తోంది. కాగా.. గతేడాది విడుదలైన 3 బీహెచ్‌కే సినిమాలో సిద్ధార్థ్ తల్లిగా దేవయాని కనిపించిన విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com